తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 01.09.2026 | సంపుటి :13 సంచిక : 43 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






చేయూత పింఛన్ల దరఖాస్తుల

## గడువు పొడిగింపు

సెప్టెంబర్ 15 వరకు కొనసాగిస్తూ నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది.

మిగతా 2లో..



సింధు జలాలపై తీర్పు..

## తోసిపుచ్చిన భారత్

ప్రపంచబ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టుకు ఆ పరిధిలేదని వెల్లడి

2లో..

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

## తీర్చిదిద్దే దిశగా సర్కారు అడుగులు: సీఎం రేవంత్

- సీఎం నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బ్రిటన్, అమెరికా పర్యటన విజయవంతం
- పర్యటనలో కీలక, అవగాహనా ఒప్పందాలపై ప్రత్యేక నివేదికను
- సీఎం రేవంత్‌కు అందించిన కమిటీ

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఇటీవల బ్రిటన్, అమెరికా దేశాల్లో చేపట్టిన సుదీర్ఘ పర్యటన విజయవంతమైంది. ఈ విదేశీ పర్యటనలో సాధించిన చారిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహనా ఒప్పందాలు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ల సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో ఇప్పటికే ప్రపంచ పటంలో ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్ నగరాన్ని,

మిగతా 2లో..



మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

"ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇప్పటివరకు రూ.1.24 కోట్ల జీతం తీసుకున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ కోసం ప్రభుత్వం రూ.22 కోట్లు ఖర్చు చేసింది. వెయ్యి రోజుల్లో రూ.22 కోట్ల ప్రజల సొమ్మును తీసుకున్నారు. రూ.22 కోట్ల ప్రజల సొమ్ము తిన్న వ్యక్తి ఒక్కనాడు కూడా ప్రజల కోసం బయటికి రాలేదు. బంధువులు చనిపోతే వెళ్తారు. మనవడి కోసం ఆస్పత్రికి వెళ్తారు. వెయ్యి రోజులుగా ఫామ్‌హౌస్‌లోనే ఉన్న వ్యక్తికి జీతభత్యాలు అవసరమా?. పని చేయకుం డా ప్రజల సొమ్ము తింటున్న ప్రతిపక్షనేత సెప్టెంబర్ 6వ తేదీలోపు రాజీనామా చేయాలి.. ప్రభుత్వ సొమ్ము తిరిగి చెల్లించాలి"

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం

- సెప్టెంబర్ 6లోపు కేసీఆర్ రాజీనామా చేయాలి
- ఆయన కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.21 కోట్లు
- నగరంలో ఏడాదిలోపు లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు
- అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య హైలెవల్
- బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..



మంత్రి కొండా సురేఖ లేకుండానే ఆమె నియోజకవర్గంలో కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు



# కొండా 'ప్రొటోకాల్' ఔట్..!

## మంత్రి పదవి డౌట్..!

శిలాఫలకాలు, బ్యానర్లపై అధికారికంగానే పేరు తొలగింపు

మంత్రివర్గ విస్తరణకు ముందే బర్తరఫా..?

అభివృద్ధి కార్యక్రమాలు.. ప్రొటోకాల్ వివాదానికి దారితీశాయి. కేసముద్రం మండలంలో తాజాగా నిర్వహించిన పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి సురేఖ ఫొటో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ అధికారిక కార్యక్రమాల్లో ఇదే పరిస్థితి ఎదురైన నేపథ్యంలో.. వరుసగా జరుగుతున్న ఈ పరిణామాలపై అధికారులు ఎలా వివరణ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మంత్రి సురేఖకు మరోసారి అవమానం జరిగిందంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం.

మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి): కేసముద్రం మండల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై, ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రచార సామాగ్రిలో పలువురు ఇతర పార్టీల ప్రజాప్రతినిధుల చిత్రాలు కనిపించినప్పటికీ మంత్రి సురేఖ ఫొటో లేకపోవడం స్థానికంగా చర్చకు కారణమైంది. గతంలో కూడ మహబూబాబాద్ నియోజకవర్గంలో గూడూరు మండలంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో కూడా మంత్రి సురేఖ ఫొటో లేకపోవడం చర్చనీయాంశం అయ్యింది. జిల్లా సమీకృత కార్యాలయంలో మహబూబాబాద్ ఎస్పీ ఏర్పాటు చేసిన పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కూడ మంత్రి సురేఖ ఫొటో లేకపోవడం గమనార్హం.

మిగతా 2లో..

## విదేశాల్లో భిన్నత్వంలో ఏకత్వం..

# స్వదేశంలో మాత్రం తూట్లు!



న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కొత్త భాష్యం

దేశంలో మాత్రం మైనారిటీలపై భిన్న స్వరం

న్యూయార్క్:(జనంసాక్షి): అమెరికా గడ్డపై "ముస్లింలకు భారత్‌లో స్థానం లేదంటే అతడు హిందువు కాదు" మరి ఈ మాటలు స్వదేశంలో ఎందుకు వినిపించవు?"విదేశీ గడ్డపై ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చెప్పిన మాటలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. న్యూయార్క్‌లో జరిగిన విశ్వ మత పెద్దల సమావేశంలో ఆయన "భారత్‌లో ముస్లింలకు స్థానం లేదని భావించే వ్యక్తి హిందువు కాదు" అని ప్రకటించారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిలయమని, అన్ని మతాలను గౌరవించాలన్న సందేశాన్ని ఇచ్చారు. అయితే భగవత్ వ్యాఖ్యలపై అసలు ప్రశ్న ఇప్పుడు న్యూయార్క్‌లో చెప్పిన మాటల గురించి కాదు.. అవే మాటలు భారతదేశంలో ఎందుకు అంత బలంగా వినిపించవన్నదే!

**అమెరికాలో ఒక మాట.. భారత్‌లో మరో మాట?**

విదేశాల్లో భారతదేశం బహుళత్వం, మత సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పడం సులభమే. కానీ దేశంలో మతం, కులం, ఆహారం, దుస్తులు, భాష ఆధారంగా సమాజంలో విభజనలకు దారితీసే రాజకీయవాతావరణంపై ఆర్ఎస్ఎస్ ఎంత స్పష్టంగా మాట్లాడుతోంది? అన్నదే ఇప్పుడు చర్చ. భగవత్ అమెరికా వేదికపై చెప్పిన "ముస్లింలు భారత్‌లో ఉండకూడదని భావిస్తే అతడు హిందువు కాదు"

మిగతా 2లో..

## పెద్దపులి తిరుగుతాంది..

# జర పైలం!



- ఎద్దును చంపింది..ఏం చేస్తదోనని జనం బెంబేలు
- వ్యవసాయ పనులకు వెళ్లాలంటేనే భయం
- పలు మండలాల్లో పులి పాదముద్రలు
- రావణ్‌పల్లి అటవీ ప్రాంతంలో మళ్లీ దాడి.. ఎద్దు మృతి



రావణ్‌పల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడి చేయడంతో మృతి చెందిన ఎద్దు

ఆసిఫాబాద్/సిర్పూర్‌టి (జనంసాక్షి) :కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. సిర్పూర్(టి) మండలం మేడిపల్లి గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రావణ్‌పల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను అటవీశాఖ అధికారులు నిర్ధారించారు.కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూరు, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట తదితర ప్రాంతాల్లో పులి సంచారానికి సంబంధించిన ఆనవాళ్లు, పాదముద్రలు కనిపించడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు. పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో పులి సంచారం పెరగడంతో పొలాలకు వెళ్లేందుకు జనం భయపడుతున్నారు. పులి కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా కొనసాగిస్తున్నారు. గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచిస్తున్నారు. పశువుల

మిగతా 2లో..

నీటిని యథేచ్ఛగా తరలిస్తుంటే ప్రభుత్వం

# మౌనమేలా?

రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా ఆడబిడ్డల భద్రత

తుక్కుగూడ ఘటనే ఇందుకు నిదర్శనం: హరీశ్



హైదరాబాద్(జనంసాక్షి):నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ

మిగతా 2లో..

అందరి అవినీతి

# బయటపెడతా

- తెలంగాణ కోసం కష్టపడితే నన్ను గెంటేశారు
- జీవితంలో ఎవరిని క్షమించినా ప్రశాంత్‌రెడ్డిని క్షమించను
- నేను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారు
- అండగా ఉండాల్సిన పార్టీయే నన్ను అన్యాయంగా గెంటేసింది
- అయినా నిప్పులా తిరిగి వచ్చాను
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత భావోద్వేగ వ్యాఖ్యలు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): తెలంగాణ కోసం కష్టపడ్డ తనను అన్యాయంగా బయటకు గెంటేశారని, ఎంతో కష్టపడి పార్టీ అధికారంలోకి వచ్చేలా చేసిన సొంత పార్టీలోనే నాకు స్థానం లేకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని ఆమె దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా

మిగతా 9లో..



# కెనడాను వీడండి



## ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు

వెంటనే వచ్చేయాలని అమెరికా కంపెనీలకు సూచన

వాషింగ్టన్,ఆగస్ట్31(జనంసాక్షి): అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో

మిగతా 9లో..

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే ప్రయత్నాలకు

# భారత్ మద్దతు

ఉద్రిక్తతల వేళ ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

బిష్కెక్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ప్రధాని నరేంద్ర మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు కిర్గిస్థాన్‌లో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడిని కలవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సమావేశంలో యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వంటి కీలక అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే

మిగతా 9లో..



## ఢిల్లీలో మరో నిర్భయ తరహా ఘటన..

లిఫ్ట్ ఇచ్చి, కదులుతోన్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్



9లో..

## అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య

సొరంగాల్లో చిక్కుకున్న 930 మంది సిబ్బంది..!

కొనసాగుతున్న సహాయక చర్యలు

# ఏఆర్‌టీ, సరోగసీ చట్టాలు కట్టుదిట్టంగా అమలు

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించడంతో పాటు, ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే సెంటర్లపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ల పనితీరు, ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై మంత్రి సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గాంధీ హాస్పిటల్, పేట్లబుర్జు హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరును మంత్రి సమీక్షించారు. ఈ రెండు సెంటర్లలో కలిపి ఇప్పటివరకు 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించామని అధికారులు తెలిపారు. 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు చేసినట్లు మంత్రికి వివరించారు. ఎంతో మంది దంపతులు తమ సంతాన కలను నెరవేర్చుకోవడంలో గాంధీ, పేట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్లు ఉపయోగపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. గాంధీ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను 2024 అక్టోబర్‌లో, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను 2024 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ రెండు సెంటర్లు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రిజిస్టర్ అయి ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో 129 ఏఆర్‌టీ లెవల్-1, 226 ఏఆర్‌టీ లెవల్-2, 59 ఏఆర్‌టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నాయని తెలిపారు. ఏఆర్‌టీ, సరోగసి చట్టాల ప్రకారం సెంటర్ల కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సెంటర్లలో సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ తదితర అంశాలను తనిఖీ చేయాలని సూచించారు.

# తెలంగాణను గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమిట్
- రాష్ట్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం
- గ్రీన్' అంటే ఖరీదైనదనే భావన మారాలి
- స్వచ్ఛమైన విద్యుత్ వైపు తెలంగాణ అడుగులు
- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 25వ వార్షికోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టీకరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ నవ యువ రాష్ట్రమైనప్పటికీ అత్యంత ఉన్నతమైన ఆశయాలు, స్పష్టమైన పర్యావరణ-పారిశ్రామిక లక్ష్యాలతో ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా కొరియా, జపాన్ వంటి అత్యంత అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో, యువ మరియు క్రియాశీలక క్యాబినెట్ సహచరుల భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను తప్పకుండా సాధిస్తామనే ధీమాను డిప్యూటీ సీఎం వ్యక్తం చేశారు. తెలంగాణను ఆర్థికంగా, పారిశ్రామికంగా, సుస్థిర గ్రీన్ టెక్నాలజీలో ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు చేపడుతున్న ఈ ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రజలందరూ భాగస్వాములై తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను, పర్యావరణ అనుకూల పరిశ్రమలను ఆకర్షించడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక బృహత్తర గ్లోబల్ సమిట్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ గ్లోబల్ సమిట్ రాబోయే డిసెంబర్ 7, 8 మరియు 9 తేదీలలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలు, సుస్థిర నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు ఈ సదస్సులో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కేవలం సదస్సులో పాల్గొనడమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక, గ్రీన్ విధానాలకు దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేస్తున్న 'సలహా మండలి'లో చేరి తమ విలువైన మార్గదర్శకత్వాన్ని అందించాలని డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. పర్యావరణహిత నిర్మాణాలు కేవలం ఖరీదైన భవనాలు, విలాసవంతమైన అపార్ట్‌మెంట్లకే పరిమితం కాకుండా సామాన్యుల ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, గృహ నిర్మాణాల్లోనూ భాగం కావాలని పిలుపునిచ్చారు. గ్రీన్ బిల్డింగ్స్ అభివృద్ధికి అదనంగా చేర్చే ఫ్యాషన్ అంశం కాదని, మొదటి నుంచే సరైన పద్ధతిలో నిర్మించడమే దాని లక్ష్యమని స్పష్టం చేశారు. తక్కువ శీతలీకరణ అవసరమయ్యేలా భవనాలను రూపొందించడం, సహజ కాంతిని, నీటిని, విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పర్యావరణంపై, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించవచ్చన్నారు. "అత్యంత చౌకైన విద్యుత్ యూనిట్ అంటే మనం ఉత్పత్తి చేయాల్సిన అవసరం లేని విద్యుత్ యూనిట్" అని ఆయన అభివర్ణించారు.

రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న నగరాలు, పరిశ్రమలు, డేటా సెంటర్ల అవసరాలకు తగినట్లుగా సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టిసారించిందని చెప్పారు. సుస్థిర మౌలిక వసతుల ప్రయోజనాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరాలని ఆకాంక్షించారు. సరిగ్గా డిజైన్ చేయని భవనం ప్రారంభంలో చౌకగా కనిపించినా, భవిష్యత్తులో అధిక విద్యుత్, నీటి బిల్లుల రూపంలో మూల్యం చెల్లించాల్సి వస్తుందని.. కాబట్టి భవనం జీవితకాల నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ఆదా చేయడం అంటే విద్యుత్ ఉత్పత్తి అవసరాన్ని తగ్గించడమేనని గుర్తుచేశారు. సుస్థిర నిర్మాణాలు సంపన్న వర్గాలకే పరిమితం కాకూడదని, సాధారణ కుటుంబాలు కూడా తక్కువ విద్యుత్, నీటి వినియోగంతో ఖర్చును ఆదా చేసుకోగలిగితేనే గ్రీన్ బిల్డింగ్ లక్ష్యం నెరవేరుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, సామూహిక గృహ నిర్మాణాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయడానికి ఐజిబిసితో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సుస్థిర నిర్మాణాలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం, పరిశ్రమలు, ఐజిబిసి, విద్యా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాబోయే 25 సంవత్సరాల్లో 'గ్రీన్ బిల్డింగ్' అనే పదాన్ని ప్రత్యేకంగా ఉపయోగించాల్సిన అవసరం లేకుండా, పర్యావరణహిత నిర్మాణమే భారతదేశ సాధారణ నిర్మాణ విధానంగా మారాలని ఆకాంక్షించారు.

# ప్రైమ్ కేర్ ఆస్పత్రి యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలి

చైతన్య మహిళా సంఘం డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : తుక్కుగూడ ప్రాంతంలో ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతిపై అత్యాచార ప్రయత్నం, ఆపై దారుణ హత్య జరగడాన్ని చైతన్య మహిళా సంఘం తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, కో-కన్వీనర్స్ శ్రీదేవి, రాధ మాట్లాడుతూ నిందితుడు సైనా ఉల్లా ఆగస్టు 28 రాత్రి కిటికీ గది ద్వారా ప్రవేశించి, యువతిపై అత్యాచారం ప్రయత్నం చేయగా, ఆమె ప్రతిఘటించటంతో ఆమె ను గొంతు ను లిపి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారని, ఈ విషయం సీసీటీవీ ఇతర సాంకేతిక ఆధారాలతో గుర్తించి 30వ తేదీన నిందితుడిని అదు పులోకి తీసుకున్నట్టు తెలిపారని తెలిపారు. ఎంతోమంది అమ్మాయిలు హైదరాబాదుకు ఒంటరిగా జీవనోపాధి కొరకు వస్తున్నారని, వారి భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. ప్రైవేట్ సంస్థల్లో అది ఇంకా ఘోరంగా ఉంటుం దని, ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో సిబ్బంది రెస్ట్ తీసుకునే రూముల్లో కిటికీలకు గ్రిల్స్ లేకపోవడం, వంటి అంశాలు పోలీసుల దర్యాప్తులో బయటప డడం శోచనీయమని, ప్రైవేటు ఆసుపత్రులు తమ లాభాపే క్ష లక్ష్యంగా చూసుకుంటూ , సిబ్బందికి, పేషెంట్లకు కనీస భద్రత ఇవ్వడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాలను సీరియస్‌గా తీసుకొని నర్సును హత్య చేసిన వారి పైనే కాకుండా, సిబ్బందికి భద్రత ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన ప్రైమ్ కేర్ ఆసుపత్రి యజమాన్యంపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# వెలుగొండకు నికర జలాలు తరలించి వినియోగించాలి

- ఏపీ జలచౌర్యాన్ని అడ్డుకోవడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి బ్యూరో ఆగస్టు31 (జనంసాక్షి) : వెలుగొండ ప్రాజెక్టుకు కృష్ణా నదిలోని వరద జలాలను మాత్రమే వినియోగించాల్సి ఉండగా, నికర జలాలను ఆంధ్రప్రదేశ్ తరలించు కుపోతున్నా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ చేపడుతున్న జల ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభం తెలంగాణకు దుర్దినమని వ్యాఖ్యానించారు.వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ఆంధ్రప్రదేశ్ జల వినియోగంపై సుమారు రెండు గంటలపాటు వివరించారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులు, రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు, ఏపీ చేపట్టిన ప్రాజెక్టులపై వైట్‌బోర్డుపై డయాగ్రామ్‌ల ద్వారా వివరించారు. తెలంగాణ సాగునీటి విషయంలో కాంగ్రెస్ మొదటి నుంచీ ప్రధాన శత్రువుగా వ్యవహరిస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు ప్రయత్నించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి వ్యవస్థలో పురోగతి నిలిచిపోయిందని అన్నారు.కృష్ణా నికర జలాలను ఏపీ ప్రాజెక్టులకు తరలించకుండా అడ్డుకోవాలని, వెలుగొండకు వరద జలాలనే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నికర జలాలను తరలించడం జలచౌర్యమేనని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ సొంత నిధులతో చేపట్టి 2023 నాటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. పంపింగ్ స్టేషన్లు, నాలుగు రిజర్వాయర్లు, టన్నెళ్ల నిర్మాణంలో ప్రధాన పనులు పూర్తయ్యాయని చెప్పారు.ప్రాజెక్టును 802 అడుగుల స్థాయిలో డిజైన్ చేశామని, 27 వేల ఎకరాల భూసేకరణ చేపట్టామని తెలిపారు. నార్లాపూర్--ఏదుల లింక్ కెనాల్‌లో మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేస్తే పాలమూరు జిల్లాలో సుమారు 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేదని, రెండున్నరేళ్ల అనంతరం సీఎం ప్రాజెక్టును సందర్శించినా సమగ్ర సమీక్ష, ఇంజినీర్లకు అవసరమైన ఆదేశాలు కనిపించలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఆలస్యం అయితే ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం చేకూరుతుందని నిరంజన్‌రెడ్డి అన్నారు. జూరాలకు వరద వచ్చిన సమయంలోనూ తెలంగాణ వైపు ఉన్న ఎత్తిపోతల పంపులను పూర్తి స్థాయిలో వినియోగించలేకపోతున్నారని విమర్శించారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు సుమారు 0.2 టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోసే సామర్థ్యం ఉందని, ఏడాదికి సుమారు 40 టీఎంసీల వరకు మాత్రమే ఎత్తిపోసే అవకాశం ఉందని తెలిపారు. ఏపీ రోజుకు 11 టీఎంసీల నీటిని తరలించుకుపోతోందని ఆరోపించారు.

నియోజకవర్గంలో అవగాహన లేకుండా, నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మిడిమిడి జ్ఞానంతో ప్రొజెక్టర్ పెట్టుకుని తలాతోక లేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తనపై, బీఆర్ఎస్‌పై రాజకీయ ఆరోపణలు కొనసాగిస్తే తగిన రాజకీయ సమాధానం ఇస్తామని పేర్కొన్నారు.పాలమూరు పచ్చబడాలనే లక్ష్యంతో కేసీఆర్‌ను ఒప్పించి సాగునీటి ప్రాజెక్టులు తీసుకువచ్చామని, వాటి ఫలితాలు ప్రజలకు అందేలా చూడటమే తమ లక్ష్యమని చెప్పారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వామన గౌడ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, జగదీశ్వర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కృష్ణానాయక్, కర్రిస్వామి, ఎం.వేణుగోపాల్, రాళ్ల కృష్ణయ్య, సామ్యానాయక్, దిలీప్‌రెడ్డి, రాజశేఖర్, శివరామ్‌రెడ్డి, శ్రీకర్‌గౌడ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, నాగన్నయాదవ్, సునీల్ వాల్మీకి, గులాం ఖాదర్‌ఖాన్, బొబ్బిలి ప్రేమ్‌కుమార్, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, నందిమల్ల సుబ్బు, మంద రాము తదితరులు పాల్గొన్నారు.



# నేడు పెన్షన్ విద్రోహ దినం పాటించాలి

గద్వాల (జనంసాక్షి) : నేడు పెన్షన్ విద్రోహ దినం పాటించాలని పెన్షనర్ల స్టేట్ గవర్నమెంట్ అసోసియేషన్ తెలంగాణ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు అబ్దుల్ బాబు, ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ శాస్త్రి, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి సుబాన్, రిటైర్డ్ జిహెచ్ఎం ఇమ్మానియేల్ ,ప్రభుదాస్, రాజు ప్రకాష్, ఉమామహేశ్వర్, శ్రీనివాసులు తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు జోగులాంబ గద్వాల కలెక్టరేట్‌లో పెన్షన్ విద్రోహ దినం పాటించాలని సూచించారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. రిటైర్డ్ ఉద్యోగులను దాదాపు 200 మందిని బలిగొన్న పాలన అని, హామీలు మరచిన పాలన 6. డి ఏ లు పెండింగ్లో ఉంచారని, పి.ఆర్.సిని పెండింగ్లో ఉంచారని, ఇది మాటల ప్రభుత్వం హెల్త్ కార్డు ఇస్తామన్నారని, మూడు నెలల డబ్బులు గుంజుకున్నారని, ఇంతవరకు హెల్త్ కార్డులు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం మాట ఇచ్చి ద్రోహం చేసే ప్రభుత్వమని తెలిపారు.

# భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

కోల్‌కతా, ఆగస్ట్31 (జనంసాక్షి) : భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు.

# సెప్టెంబర్ 15 వరకు చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా

హైదరాబాద్ (జనంసాక్షి) : చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువును రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించడంపై మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తొలుత ఆగస్టు 31తో గడువు ముగియాల్సి ఉండగా, అర్హులైన పేదలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితరులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అదనపు సమయం కల్పించడం అభినందనీయమన్నారు. సాంకేతిక సమస్యలు, అవసరమైన ధ్రువ పత్రాల ఆలస్యం తదితర కారణాలతో పలువురు అర్హులు దరఖాస్తు చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభు త్వం తీసుకున్న నిర్ణయంతో ఇప్పటివరకు దరఖా స్తు చేసుకోలేని అర్హులకు మరో అవకా శం లభించిందన్నారు. గడువు లోగా అర్హులంద రూ దరఖాస్తు చేసుకుని చేయూత పెన్షన్ ప్రయోజనం పొందాలని సూచించారు.

# విముక్త జాతుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31(జనంసాక్షి ): జిల్లాలో విముక్త జాతుల ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విముక్త జాతుల దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విముక్త జాతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, వారికి గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడంతో పాటు పిల్లలకు విద్య, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. బ్రిటిష్ వారి కాలంలో విముక్త జాతుల వారిని క్రిమినల్ ట్రైబ్స్ చట్టం తీసుకువచ్చి నిర్బంధించిందని, స్వాతంత్రం వచ్చిన తరువాత ఆ చట్టాన్ని ఎత్తివేసి డి-నోటిఫైడ్ ట్రైబ్స్ చట్టం తీసుకువచ్చి విముక్త జాతులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. విముక్త జాతుల వారు తమ సాంప్రదాయ వృత్తులు, కళలు, జానపద ప్రదర్శనలు, జీవన విధానాలు తెలంగాణ సంస్కృతికి ఎంతో విలువైన సంపద అని సమాజానికి వారు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. మన సంస్కృతిని సజీవంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ప్రతి విద్యార్థికి విద్య, యువకులకు నైపుణ్యం, ఉపాధి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవితం అందించే విధంగా సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. విముక్త జాతుల సాంప్రదాయ కళలు, వృత్తులు, జానపద సంస్కృతిని కాపాడుకోవడానికి కృషి చేద్దామని, సమాజంలో అన్ని వర్గాల వారితో సమానంగా జీవించేలా వారి హక్కులను కాపాడుదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, విముక్త జాతుల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్ రంగంలోకి సింగరేణికి ఆహ్వానం

- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో మోనాష్ యూనివర్సిటీ బృందం భేటీ



హైదరాబాద్ (జనంసాక్షి) : కీలక ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఆస్ట్రేలియా దేశంలో కలిసి పనిచేయడానికి ముందుకురావాలని ఆ దేశ ప్రముఖ పరిశోధన సంస్థ మోనాష్ యూనివర్సిటీ సింగరేణికి ఆహ్వానం పలికింది. మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి తో సమావేశమై ఆస్ట్రేలియా దేశంలో క్రిటికల్ మినరల్స్ రంగంలో గల అవకాశాలను వివరించింది. తమ దేశం అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని క్రిటికల్ మినరల్స్ రంగంలో కోరుకుంటోందని, మైనింగ్ రంగంలో విశేష అనుభవం కలిగిన సింగరేణి సంస్థను కూడా పరస్పర లాభదాయ భాగస్వామ్యం కోసం ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా నేడు క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ ఉందని, ఈ రంగంలో తాము ఆధునిక సాంకేతిక, పర్యావరణ హిత మైనింగ్, లాభదాయక వ్యూహాత్మక వ్యాపార చర్యలపై తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి సంసిద్ధంగా ఉన్నామని వివరించారు. పరిశోధన, విద్య, పరిశ్రమలతో భాగస్వామ్యం, పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలుగా మార్చడంలో మోనాష్ యూనివర్సిటీకి ఉన్న అనుభవాన్ని ఆ బృందం వివరించింది. అంతర్జాతీయ స్థాయిలో పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో కలిసి వివిధ రంగాల్లో పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం క్రిటికల్ మినరల్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం, వాటి అన్వేషణ, వెలికితీత, ప్రాసెసింగ్, రిఫైనింగ్‌తో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముడి ఖనిజాలకే పరిమితం కాకుండా డౌన్‌స్ట్రీమ్ ప్రాసెసింగ్, రిఫైనింగ్ ద్వారా అదనపు విలువను సృష్టించే అవకాశాలను మోనాష్ బృందం వివరించింది. మైనింగ్ రంగంలో సుస్థిరత, పర్యావరణ హిత విధానాలు, మైన్ క్లోజర్ ప్లానింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాల్లో తమ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశంచడానికి చేస్తున్న కృషిని సింగరేణి అధికారులు మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులకు వివరించారు. ఇటీవలే కర్ణాటకలో బంగారం-రాగి గనుల అన్వేషణను ప్రారంభించామని వివరించారు. క్రిటికల్ మినర్సల్ రంగంలో పరస్పర లాభదాయకమైన భాగస్వామ్యం కోసం అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. మోనాష్ యూనివర్సిటీ-సింగరేణి మధ్య పరిశోధన, ఆధునిక సాంకేతికత, క్రిటికల్ మినరల్స్, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో భవిష్యత్ సహకార అవకాశాలను పరిశీలిస్తామన్నారు. త్వరలో సింగరేణి ఉన్నతస్థాయి అధికార బృందాన్ని ఆస్ట్రేలియాలో అవకాశాల పరిశీలనకు పంపిస్తామన్నారు. సమావేశంలో సింగరేణి భవన్ నుంచి డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కొత్తగూడెం కార్పోరేట్ ఆఫీస్ నుంచి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్(పిపి) కె.వెంకటేశ్వర్లు, జీఎం(బీడీ) రాందాస్, జీఎం (ఎక్స్ ప్లోరేషన్) పంకజ్ కులశ్రేష్ట, మోనాష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యానిస్ వెంటికోస్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

## మూడు అడుగులు కూడా లేని ఆరేళ్ల పోరడు..
# సర్కారుకు ముచ్చెమటలు!

**'నన్ను ఎలా అరెస్ట్ చేస్తారు? ఇది చట్టవిరుద్ధమైన నిర్బంధం కాదా?'**
**నా తల్లిదండ్రులపై ఎందుకు దాడి చేశారు?" "రాజ్యాంగంలో ఇది ఎక్కడ రాశారు?'**

ఆరేళ్ల వయసు. ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇంకా ప్రపంచాన్ని పూర్తిగా అర్థం చేసుకునే వయసు కూడా కాదు. కానీ పాట్నా వీధుల్లో నిలబడి అతను సంధిస్తున్న ప్రశ్నలు మాత్రం ఒక రాష్ట్ర ప్రభుత్వాన్నే కాదు.. మొత్తం వ్యవస్థను ఆలోచింపజేస్తున్నాయి. ఆదిత్య కుమార్ అనే ఈ చిన్నారి ఇప్పుడు బిహార్ రాజకీయ, సామాజిక చర్చలో ఒక ప్రతీకగా మారాడు. ఆగస్టు 25న బీపీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలో పాల్గొన్న అతను పోలీసుల అదుపులోకి వెళ్లిన ఘటన తర్వాత తన తల్లిదండ్రులకు జరిగిన అన్యాయంపై గర్దనిబాగ్‌లో నిరసనకు కూర్చున్నాడు.

ఆదిత్య ఆరోపణ ప్రకారం.. తనను పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రుల నుంచి గంటల తరబడి వేరు చేసి ఉంచారు, ఆ సమయంలో తన తల్లిదండ్రులపై పోలీసులు దాడి చేశారు. ఆ చిన్నారి ప్రెస్ మీట్ పెట్టి మరీ చెబుతున్నాడు.ఒక చిన్నారి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాత్రం వ్యవస్థపై ఉంది. ఆదిత్య గొంతులో వినిపిస్తున్నది కేవలం తన కుటుంబం కోసం న్యాయం కోరుతున్న ఓ చిన్నారి ఆవేదన కాదు. నిరుద్యోగం, నియామక పరీక్షలపై అనిశ్చితి, విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యలపై పెరుగుతున్న అసంతృప్తి వంటి పెద్ద ప్రశ్నలన్నింటినీ ఆ బాలుడి అమాయకమైన ముఖం ముందుకు తెస్తోంది. ఆగస్టు 25న జరిగిన బిహార్ విద్యార్థుల ఆందోళనలో పోలీసులు నీటి ఫిరంగులు ప్రయోగించి పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు కూడా వార్తలు వచ్చాయి.

అయితే ఆదిత్య ప్రత్యేకత అతను ఎంత చిన్నవాడన్నదిలో లేదు. అతను భయపడకుండా ప్రశ్నించడం, తనకు తెలిసిన రాజ్యాంగాన్ని ఆధారంగా చేసుకుని జవాబు అడగడంలో ఉంది. పోలీస్ స్టేషన్ అంటే భయపడే వయసులో పోలీసులనే ప్రశ్నిస్తున్నాడు. అధికారాన్ని చూసి వెనక్కి తగ్గే వయసులో అధికారాన్ని జవాబుదారీగా నిలదీస్తున్నాడు. విలేకరుల సమావేశంలో పెద్దల మాదిరిగా తడబడకుండా మాట్లాడుతున్న అతని దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు వచ్చాయి.

ఇక్కడ ఆదిత్యను కేవలం 'వైరల్ బాలుడు'గా చూడటం పొరపాటు. అతని మాటల్లోని ప్రశ్నను చూడాలి. ఒక పౌరుడిని అదుపులోకి తీసుకున్నప్పుడు చట్టబద్ధమైన ప్రక్రియ ఏమిటి? ఒక చిన్నారిని తల్లిదండ్రుల నుంచి వేరు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? పోలీసులపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ ఎందుకు జరగకూడదు? ఇవే అసలు ప్రశ్నలు.

అధికారం అంటే ప్రజలను భయపెట్టడం కాదు. అధికారం అంటే ప్రజలకు జవాబు చెప్పడం. పోలీసు వ్యవస్థ అంటే ప్రజలను అణచివేయడం కాదు. ప్రజల హక్కులను కాపాడటం. ముఖ్యంగా ఒక చిన్నారి ముందుకు వచ్చి "రాజ్యాంగంలో ఎక్కడ రాశారు?" అని అడిగినప్పుడు, ఆ ప్రశ్నను ఎగతాళి చేయకుండా, కోపంగా చూడకుండా, అత్యంత బాధ్యతతో సమాధానం చెప్పగలగడమే ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలైన పరీక్ష. ఆదిత్య తన పోరాటాన్ని దశరథ్ మాంఝీ స్ఫూర్తితో పోల్చుతున్నాడు. కొండను ఛేదించిన మాంఝీ కథ అతనికి ధైర్యాన్నిచ్చింది. ఇప్పుడు ఈ చిన్నారి చేతిలో ఉన్నది సుత్తి కాదు.. రాజ్యాంగం. అతని ఆయుధం బలం కాదు.. ప్రశ్న. అతని వెనుక ఉన్నది అధికార యంత్రాంగం కాదు.. న్యాయం కావాలనే పట్టుదల.

ఆరేళ్ల బాలుడి భుజాలపై ఇంతటి పోరాటం ఉండటం ఒకవైపు ఆశ్చర్యం కలిగిస్తే.. మరోవైపు ఆ సమాజం, ఆ వ్యవస్థ గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. పిల్లలు రాజకీయాల్లోకి రావాల్సిన పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి గొప్ప విజయమేమీ కాదు; పిల్లలు ప్రశ్నించే స్థాయికి వ్యవస్థపై అనుమానం పెరగడం మాత్రం పాలకులకు తీవ్రమైన హెచ్చరిక.

ఆదిత్యకు న్యాయం దక్కుతుందా లేదా అన్నది విచారణ తేల్చాలి. పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తప్పక ఉండాలి. ఆరోపణలు నిజం కాకపోతే వాస్తవాలను ప్రజల ముందుంచాలి. కానీ ఈ చిన్నారి అడిగిన ప్రశ్నలను మాత్రం అరెస్టు చేయలేరు.. అదుపులోకి తీసుకోలేరు.. లాఠీతో అణచలేరు. ఎందుకంటే అవి ఆదిత్య ప్రశ్నలు మాత్రమే కావు. అవి రాజ్యాంగం చదువుతున్న భారతదేశపు కొత్త తరపు ప్రశ్నలు. **మూడు అడుగులు కూడా లేని ఆరేళ్ల పోరడు..అధికారానికి మాత్రం అడుగడుగునా ప్రశ్నలు వేస్తున్నాడు.**

## ఉప్పొంగిన జలఖడ్గం

కొండా కోనల్లో విషాదగీతం..
?పర్వత సానువుల్లో జల ప్రళయం
హిమగిరుల ప్రకృతి విలయం
కన్నీటి సంద్రమై
గుండె పగిలిన వేళ!!

కొట్టుకుపోయిన సుందర లోయలు
కన్నీటి గాథలుగా మిగిలిపోయాక
హిమశిఖరాల రుద్రతాండవంక్రింద
బురదలో నలిగినప్రాణాలు"
అంకెల్లో కుదించబడి,
కుళ్ళిపోతున్న మృతదేహాలతో
శవాగారాలు కిక్కిరిసి
గల్లంతైన వారికోసం
ఆచూకీ తెలియక,రోధనలతో
ప్రకృతి రాసిన మరణ శాసనానికి
నేపాలం నేడు కన్నీటి సముద్రమైంది!

పచ్చని లోయల్లో...భారీ
హిమనదాల మంచు ప్రళయం
ఎక్కడ చూసినా,
శిథిలాల మధ్య ప్రాణాలతో
హాహాకారాలు!!
గూడు చెదిరిన పక్షుల్లా
మహా ప్రవాహంలో
కొట్టుకుపోయిన ప్రజా జీవనం
ఊళ్లకు ఊళ్ళు
వరద నీటిలో తేలియాడి

నీటి సంద్రాలై తలపించిన వేళ
భోటెకోశి,త్రిశూలి నదులుఉప్పొంగి
సుందరమైన గ్రామాలను
తుడిచిపెట్టేసిన వైనం
?ఎటు చూసినా విరిగిన కొండచరియలు,
అనాథలై మిగిలిన
పసిపిల్లల రోదనలు.
కూలిన ఇళ్లు,
కొట్టుకుపోయిన బతుకులు,
ప్రకృతి కోపానికి బలియైన మనుషుల స్వప్నాలు

శీతల కొండలు క్షేత్రస్థాయిలో కదిలి
ఉప్పెనయ్యాయి
శిథిలాల కింద నలిగిన బతుకులు
సహాయంకోసం
ఎదురుచూస్తున్నాయి,
మంచు తెరల వెనుక దాగిన మృత్యువు
మనుషుల కలలను మింగేస్తోంది.. రండి..
నేపాల్ గుండెల్లో రేగిన గాయానికీ
మానవత్వంతో చేయందిద్దాం...!!
ఆపద వేళ అందరం ఆదుకుందాం
గల్లంతయిన వాళ్ళు
విదేశీ పర్యాటకులు,
యాత్రికులకోసం
రెస్క్యూ టీమ్‌లు చేస్తున్న సేవలకు
గాలింపుచర్యలకు,
సెల్యూట్ చేద్దాం.

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

# అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకెట్ల మీద కొత్త లేబుల్స్ వస్తాయా?

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకెట్ల లో షుగర్, సాల్ట్, సంతృప్త కొవ్వు (saturated fat) ఏ మోతాదులో ఉన్నాయో తెలియజేసే వివరాలు ప్యాకెట్ల ఫ్రంట్ భాగంలో అందివ్వడంలో జాప్యం ఎందుకు జరుగుతోంది? అని కేంద్ర ప్రభుత్వాన్నీ, ఎఫ్ ఎస్ ఎస్ఏఐ (FSSAI) నీ ఇటీవల సుప్రీంకోర్టు నిలదీసింది. ఎందుకంటే రెండుకంటే ఎక్కువ ఆహారపదార్థాలు నిర్ధారించిన పరిమితికి దాటితే వాటిని ప్యాకెట్ల పై భాగంలో రెడ్ వార్నింగ్ తో తెలియజేసే పద్ధతి చేపట్టాలనే ప్రతిపాదన ఉందని ఎఫ్ఎస్ఎస్ఏఐ సుప్రీంకోర్టుకు ఇటీవల తెలియజేసింది. ప్రజా ప్రయోజనాల కోణంలో ఇది ఒక మంచి పరిణామం. కొనుగోలుదారులు తాము విరివిగా కొని ఆరగించే ఈ పదార్థాలు నిరంతరం సేవించడం వలన అవి శరీరంలో షుగర్, సాల్ట్ మోతాదుని పెంచుతున్నాయా? అనే అంశాలు నిపుణులు చర్చిస్తున్నారు.

ప్రపంచీకరణ తర్వాత విచక్షణారహితంగా షాపింగ్ మాల్స్ లోకీ, దేశ ప్రజల శరీరాల్లోకీ ప్రవేశిస్తున్న ఈ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ లలో వాస్తవానికి ఏఏ పదార్థాలు ఏ ఏ మోతాదులో ఉన్నాయి? అవి ఎంతవరకు సేవించాలి? మొదలైన విషయాలను తెలుసుకునే హక్కు భారత పౌరుడికి ఉందని అర్థం అవుతోంది. ఇటీవల ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ దేశం మొత్తం మీద ఫుడ్ అవుట్ లెట్ల మీదా, ప్యాకెట్లు తయారు చేసే కంపెనీల మీదా నిర్వహించిన తనిఖీలలో ఎన్నెన్నో వాస్తవాలు బయటికొచ్చాయి. ఫలితంగా ఆ సంస్థ అసంఖ్యాకమైన రెస్టారెంట్ల లైసెన్స్ ను రద్దు చేసింది. మరికొన్ని ఈటరీలకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోమనీ, అలా చేయకపోతే అదే పరిస్థితి దాపురిస్తుందని ఆజ్ఞాపించింది. 100% చీఫ్‌బత్శుశ్రీ అనే పదాల వాడకం ఫుడ్ పాకెట్ల మీద ముద్రించవద్దని ఆదేశించింది. ఎన్నెన్నో రసాయనాలూ, ఎమల్సి పయర్స్, ఇతర పదార్థాలూ కలుపుతున్న ఈ ప్రొడక్టు ఎప్పటికీ 100% సహజం కావనీ, కాబట్టి ఆయా పదాలు కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించే విధంగానే ఉన్నాయనీ స్పష్టపరిచింది. పనికిరాని చెత్తంతా భారత పౌరుడి నెత్తిమీద ఆహార పదార్థాల పేరుతో విసిరేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ రకమైన తనిఖీలు, మానిటరింగ్ లూ, ప్రజల వ్యక్తిగత చైతన్యం చాలా అవసరం అని తెలుస్తోంది. అయితే, ఇప్పటికే చాలా ఆలస్యమయింది. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం, యూపీఎఫ్ వాడకం వలన డయాబెటిస్, గుండెజబ్బులు, హైపర్ టెన్షన్ రిస్క్ ఉందని తెలుస్తోంది. స్కూలు విద్యార్థుల్లో కూడా ఎన్నడూ లేనంత ఒబేసిటీ కనిపిస్తోందని నిపుణులు అంటున్నారు. ఎకానమిక్ సర్వే 2025- 26 ప్రకారం 2009 నుండి 2023 మధ్య ఒబేసిటీ రెట్టింపు అయింది. ఇదే కాలంలో యూపీఎఫ్ మార్కెట్ 150 శాతం ఊపందుకుందని తెలుస్తోంది. ఈ రెండింటి మధ్యా ఏదైనా సంబంధం ఉందా అన్న విషయంలో చర్చ కొనసాగుతోంది.



బ్రిటన్ కి చెందిన వైద్యుడు, శాస్త్రవేత్త క్రిష్ వ్యాన్ టులేకాన్ (Chris Van Tulleken) అల్ట్రా ఫుడ్ ప్రొడక్ట్స్ విషయంలో ఒక పెద్ద పరిశోధన నిర్వహించారు. తాను స్వయంగా ఈ ప్రొడక్టను సేవించి, అవి శరీరం మీద ఏ రకమైన ప్రభావాన్ని కలిగిస్తున్నాయో తెలుసుకోవడానికి లేదా హాని కలిగించే రసాయన వివిధ రకాల డయాగ్నస్టిక్ టెస్టులు తనమీదనే నిర్వహించి అద్భుతమైన వాస్తవాలను ప్రపంచానికి తెలియజేశారు. ఈ పరిశోధనలతో ఒక పుస్తకాన్ని రాసేశారు. ఖశ్రీతీఖ ్రాతీశీఛెవంooed People అనే తన పుస్తకంలో అసంఖ్యాకమైన, శాస్త్రీయమైన విషయాలను అందించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించి ఎన్నెన్నో పరిశోధనలనూ, సర్వేలనూ ఈ పుస్తకంలో ఆయన ఉటంకిస్తూ మనల్ని జ్ఞానోదయం చేస్తున్నారు. అందుకే, భారతదేశంలో కూడా నేడు యు పి ఎఫ్ ప్రొడక్ట విషయంలో ప్రజానుకూల ప్రయోజనం ఉన్న ప్రయత్నాలు కొనసాగుతూ ఉండడం అభిలషనీయం. ప్యాకెట్ల వెనుక భాగంలో ఆ ప్రొడక్ట్ లలో ఉన్న ఆహార పదార్థాల వివరాలు ముద్రించడం పాత పద్ధతి. కానీ, నేడు ఆలోచన మరో దిశలో కొనసాగుతోంది. అన్ని వివరాలు కాకపోయినా, కనీసం ప్యాకెట్లలో షుగర్, సాల్ట్, స్యాచురేటెడ్ ఫ్యాట్స్ ఏ మోతాదులో ఉన్నాయో ప్యాకెట్ల పై భాగంలో ముద్రించాల్సిన అవసరం ఉన్నట్టు నిపుణులు భావిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా ఇదే దిశలో కేంద్రానికి ప్రశ్నిస్తోందని తెలుస్తోంది.

ప్రతి అల్ట్రా ప్రాసెసింగ్ ఫుడ్ ప్రొడక్ట్ కూడా హానికరమే అని బల్లగుద్ది ఎవరూ చెప్పడం లేదు. మారిన జీవిత విధానంలో, ముందుకొచ్చిన ప్రపంచీకరణ వెల్లువలో అవతరించిన ఈ అల్ట్రా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ప్రజల జీవితాలను సౌలభ్యవంతంగా మార్చింది. సమయాన్ని ఆదా చేసింది. బయటి పనులు చేస్తూ గృహిణులుగా బాధ్యతలను నిర్వర్తించాల్సిన మహిళలకు ఇవి మరింత వరప్రసాదంగా మారిపోయాయి. ఇంటి బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత, రాత్రి ఏదో 12 గంటలకు పరుపు మీద వాలాల్సిన పరిస్థితిలో మరలా వేకువ జామున లేచి ఇంటిల్లపాది కోసం, అలానే స్కూలుకు పయనం అవుతున్న పిల్లల కోసం టిఫిన్లు, భోజనాలు రెడీ చేయడం, పిల్లల్ని కూడా స్కూలు కోసం రెడీ చేయడం అంత ఆషామాషీ విషయం ఏమీ కాదు. ఇలాంటి విషమ పరిస్థితుల్లో ఇన్ స్టంట్ ఫుడ్ ప్యాకెట్లు, అల్ట్రా ప్రాసెసింగ్ కేకులు, బిస్కెట్ల పరిశ్రమ, ఇటీవల అవతరించిన మరిన్ని కొత్త రకాల ఆహార ప్యాకెట్లు వీరి సమస్యలను పరిష్కారం చేశాయి. స్త్రీలకే కాదు, పురుషులకు కూడా జీవితాన్ని సౌకర్య వంతంగా మార్చాయి. అయితే, ప్రతి టెక్నాలజీ కూడా సౌకర్యాలను అందిస్తూనే, పక్కనే సమస్య లను కూడా సిద్ధంగా ఉంచుతుంది. ఇవే పదార్థా లలో సాల్ట్, సుగర్ ఇంకా ఇతర శరీరానికి అవసరం లేని లేదా హాని కలిగించే పదార్థాలు, రసాయనాలు ఉన్నాయనే అపవాదు ఈ పరిశ్రమకు ఉంది. పిల్లలు చిప్స్ ప్యాకెట్స్ విచక్షణారహితంగా తింటున్నారని మనకు తెలుసు. అలానే బంధువుల ఇంటికి వెళ్లేటప్పుడు ఇలాంటి ప్యాకెట్లు కొని వెళ్లడం ఆనవాయితీగా మారిపోయింది. పిల్లలు కూడా అలాంటి ప్యాకెట్ల కోసమే వేచి చూస్తుంటారు. మారాం చేసి తల్లిదండ్రులు అవేకొని ఇచ్చేలా ఒత్తిడి చేస్తారు. ఫలితంగా నచ్చినా నచ్చకపోయినా పిల్లల బాధపడలేక కూడా చాలాసార్లు తల్లిదండ్రులు వాటినే మాటిమాటికి కొని పిల్లలకు ఇవ్వాల్సిన గడ్డు పరిస్థితి నేడు ఉంది. ప్రకటనల మాయా ప్రపంచం అలా మన సామాజిక సాంస్కృతిక జీవితాన్ని తమ వ్యాపార ప్రపంచానికి అనుగుణంగా మార్చేసింది. కానీ, ఈ ప్యాకెట్లు ఇన్నేసి సేవించడం వలన ఆరోగ్యపరంగా ఏ రకమైన నష్టాలు వస్తాయన్నమాట ఎక్కడా, ఎవరూ కూడా బాధ్యతాయుతంగా చెప్పడం లేదు. ఫలితంగా నలిగిపోయేది మరలా పిల్లలే. శరీరంలోకి మితి మీరిన స్థాయిలో ఈ ప్యాకెట్ల నుండి సాల్ట్ వెళ్లేటప్పుడు ఆ పిల్లల్లో హైపర్టెన్షన్ రిస్క్ అనేది ఎల్లప్పుడూ ఉంటుందని నిపుణులు అంటున్నారు. మరి వీటిని నియంత్రించాల్సింది ప్రభుత్వ సంస్థలే కదా.

సాల్ట్ గానీ, షుగర్ గానీ శరీరానికి ఒక స్థాయికి మించి ఒక ప్రత్యేక దినం ఇవ్వకూడదు. మామూలుగా అయితే మనం సాల్ట్ గాని, షుగర్ గాని అలా తీసుకోం. కానీ, యూపీఎఫ్ ప్యాకెట్లలో అవసరానికి మించి వీటిని కలుపుతున్నారని అపవాదు ఉంది. అదే నిజమైతే, ఒక స్కూలు విద్యార్థికి నిరంతరం ఇదే ప్రొడక్టను అందిస్తున్న తల్లులు వారి పిల్లలకు వారికి తెలియకుండానే ఎక్కువేసి సాల్ట్, ఎక్కువేసి షుగర్ ఇచ్చేస్తున్నారని అర్థం. అందుకే ఈ విషయంలో ప్యాకెట్ల పై భాగంలోనే స్పష్టమైన మోతాదుల వివరాలు ఉంటే, తమకు అది మార్గదర్శకత్వం వహిస్తుంది. ఫలితంగా పిల్లల ఆరోగ్యం మీద కూడా చెడు ప్రభావం కలగదు.

స్కూలుకు వెళుతున్న పిల్లలకు ఇన్స్టెంట్ నూడుల్స్, బిస్కెట్ల ప్యాకెట్లు, కేకుల ప్యాకెట్లు, ప్రకటనల్లో కనిపించే వివిధ రకాల ప్రొడక్టు తల్లులు పిల్లలకు ఇస్తారు. ఒకరోజు, రెండు రోజులు అయితే ప్రశ్న ఎవరూ వేయరు? కానీ, అలవాటుగా ఇది కొనసాగుతూ ఉన్నప్పుడు ఆ పిల్లలు ఎక్కువేసి సంఖ్యలో, ఎక్కువేసి మోతాదులో ఈ పదార్థాలు సేవిస్తున్నప్పుడు శరీరానికి అవసరానికి మించి సాల్ట్, సుగర్, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ అందుతున్నాయి. కాబట్టి, ప్యాకెట్ల పై భాగంలో పెద్ద అక్షరాలతో స్పష్టంగా వీటి గురించి వివరించగలిగితే, వార్నింగ్ సిగ్నల్స్ అందించగలిగితే అది కొనుగోలుదారుడికి చాలా ప్రయోజనం చేకూర్చుతుంది. భారత పౌరుడి హక్కు కూడా ఇది. కాబట్టి ఈ దిశలో ప్రయాణం కొనసాగాలి.



**కేశవ్**
**ఆర్థిక సామాజిక విశ్లేషకులు**

# సమాజంలో కుటుంబానికి - భారంగా మారుతున్నారా పెద్దలు

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం అంటే ఇంట్లో పెద్దల నవ్వులు, పిల్లల సందడి, మనవళ్లతో తాతయ్య--అమ్మమ్మల అనుబంధం, కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచే ఆప్యాయత. ఇంట్లో పెద్దవారు ఉండటం కుటుంబానికి భారంగా కాదు.. బలంగా భావించేవారు. తల్లిదండ్రులు తమ జీవితాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ధారపోసేవారు. పిల్లలు పెద్దయ్యాక అదే తల్లిదండ్రులకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావించేవారు. కానీ ఆధునిక జీవన విధానం, పట్టణీకరణ, ఆర్థిక ఒత్తిళ్లు, ఉద్యోగాల కోసం వలసలు, చిన్న కుటుంబాల ధోరణి, ఆస్తి వివాదాలు, తరాల మధ్య పెరుగుతున్న అంతరం వంటి కారణాలతో కుటుంబ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రభావం ఎక్కువగా పడుతున్న వర్గాల్లో వృద్ధులు ముందున్నారు.

కొందరు పిల్లలు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపుతున్నారు. మరికొందరు వారిని బంధువుల ఇళ్లకు పంపించి తమ బాధ్యత ముగిసిందనుకుంటున్నారు. ఇంకొందరు ఆస్తి కోసం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇంటి నుంచి వెళ్లిపోవాలని స్వయంగా పిల్లలే తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇవి ఒక్కో కుటుంబ సమస్యగా కనిపించినప్పటికీ, వాటి వెనుక పెద్ద సామాజిక పరిణామం దాగి ఉంది.

ఇది కేవలం భావోద్వేగ సమస్య కాదు.. భారతదేశ జనాభా నిర్మాణంలో జరుగుతున్న మార్పులతో ముడిపడిన తీవ్రమైన సామాజిక సమస్య. 2021లో 60 సంవత్సరాలు పైబడిన వారి వాటా సుమారు 10.1 శాతానికి చేరగా, 2031 నాటికి 13.1 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి 2023 భారత వృద్ధాప్య నివేదిక ప్రకారం 2050 నాటికి దేశ జనాభాలో 20 శాతానికి పైగా 60 సంవత్సరాలు పైబడినవారే ఉండే అవకాశం ఉంది. 2021లో సుమారు 153 మిలియన్లుగా ఉన్న వృద్ధుల సంఖ్య 2050 నాటికి 347 మిలియన్లకు చేరవచ్చని అంచనా. అంటే రాబోయే కాలంలో ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులై ఉండే పరిస్థితి కనిపిస్తోంది.

ఇక్కడ ఆలోచించాల్సిన విషయం వృద్ధుల సంఖ్య పెరుగుతున్న వేగానికి అనుగుణంగా కుటుంబ సంరక్షణ వ్యవస్థ పెరుగుతోందా అన్నది. ఒకప్పుడు మూడు లేదా నాలుగు తరాలు ఒకే ఇంట్లో ఉండేవి. ఇప్పుడు భార్యాభర్తలు, ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో కూడిన చిన్న కుటుంబాలు సాధారణమవుతున్నాయి. ఒకవైపు జీవితకాలం పెరుగుతోంది.. మరోవైపు కుటుంబ సభ్యుల సంఖ్య తగ్గుతోంది. ఈ రెండు పరిణామాల మధ్య ఏర్పడుతున్న ఖాళీని ఎవరు పూరించాలి అన్నది నేటి సమాజం ముందున్న ప్రధాన ప్రశ్న.

భారతదేశంలో 80 సంవత్సరాలు పైబడిన అత్యంత వృద్ధుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. 2022 నుంచి 2050 మధ్య 80 సంవత్సరాలు పైబడిన వారి సంఖ్య సుమారు 279 శాతం పెరగవచ్చని అంచనా ఉంది. ఈ వర్గంలో ముఖ్యంగా విధవరాలు, ఆర్థికంగా లేదా శారీరకంగా ఇతరులపై ఆధారపడే మహిళల సంఖ్య




అధికంగా ఉండే అవకాశం ఉంది. అంటే వృద్ధాప్యం కేవలం "వయస్సు పెరిగింది" అనే అంశం కాదు.. వృద్ధాప్యం ఎక్కువ కాలం కొనసాగుతున్న పరిస్థితి.

ఆర్థిక భద్రత కూడా కీలకమైన అంశం. భారతదేశంలోని వృద్ధుల్లో 40 శాతానికి పైగా అత్యల్ప సంపద కలిగిన వర్గంలో ఉన్నారని, సుమారు 18.7 శాతం వృద్ధులకు స్వంత ఆదాయం లేదని నివేదికలు పేర్కొంటున్నాయి. ఒక వృద్ధుడికి తన సొంత ఆదాయం లేకపోతే రోజువారీ అవసరాల కోసం పిల్లలపై ఆధారపడాల్సి వస్తుంది. పిల్లల ఆదాయం కూడా పరిమితంగా ఉంటే కుటుంబంలో ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థిక ఒత్తిడి భావోద్వేగ ఒత్తిడిగా మారినప్పుడు తల్లిదండ్రులు "బాధ్యత" నుంచి "భారం"గా కనిపించే ప్రమాదం ఏర్పడుతుంది. వృద్ధులపై హింస అంటే కేవలం కొట్టడం కాదు. మాటలతో అవమానించడం, నిర్లక్ష్యం చేయడం, సమయానికి ఆహారం ఇవ్వకపోవడం, మందులు కొనివ్వకపోవడం, వైద్య చికిత్సను నిర్లక్ష్యం చేయడం, వారి పెన్షన్ లేదా ఆస్తిపై నియంత్రణ సాధించడం, ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి చేయడం, బంధువులతో మాట్లాడకుండా చేయడం వంటి అనేక రూపాల్లో హింస జరుగుతుంది. వీటన్నింటికంటే ప్రమాదకరమైనది ఒంటరితనం. ఇంట్లో నలుగురు ఉన్నా తనతో మాట్లాడేవారు లేకపోతే వృద్ధుడు మానసికంగా ఒంటరిగా మారిపోతాడు.

చివరికి ప్రశ్న ఒక్కటే.. తల్లిదండ్రులు పిల్లలకు భారమా? లేక పిల్లల జీవితానికి మూలస్తంభాలా? సమాధానం మన కుటుంబ సంస్కృతిలోనే ఉంది. ఈరోజు ఒక తండ్రి తన కొడుకు చేతిని పట్టుకుని నడిపించాడు. రేపు అదే తండ్రికి కొడుకు చేయి అవసరం కావచ్చు. ఈరోజు ఒక తల్లి తన పిల్లల కోసం తన నిద్రను త్యాగం చేసింది. రేపు అదే తల్లికి మందు వేసేందుకు ఒకరి చేయి అవసరం కావచ్చు. జీవితం ఒక వలయం. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మనిషి ఎప్పుడో ఒకప్పుడు ఇతరుల సహాయం కోరాల్సిందే. అందుకే తల్లిదండ్రులను చూసుకోవడం ఉపకారం కాదు.. కృతజ్ఞత. వృద్ధులకు ఆహారం పెట్టడం దానం కాదు.. బాధ్యత. వారి వైద్యం చేయించడం భారమేమీ కాదు.. మన మానవత్వానికి పరీక్ష. వారితో మాట్లాడటం సమయం వృథా కాదు.. మన కుటుంబ చరిత్రను నిలబెట్టే ప్రయత్నం.

భారతదేశం రాబోయే దశాబ్దాల్లో వేగంగా వృద్ధాప్య దశలోకి వెళ్తున్న సమాజంగా మారుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. కానీ వారిని సంరక్షించే సంప్రదాయ కుటుంబ నిర్మాణం క్రమంగా చిన్నదవుతోంది. కాబట్టి ఇప్పుడే వృద్ధుల కోసం సామాజిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయకపోతే రాబోయే దశాబ్దాల్లో సమస్య మరింత తీవ్రమవుతుంది. మన ఇళ్లలో వృద్ధులు ఉన్నారంటే అది మనకు వచ్చిన భారమని కాదు.. మన కుటుంబానికి ఉన్న జీవించిన చరిత్ర అని భావించాలి. వారి చేతుల్లో మన గతం ఉంది. వారి అనుభవాల్లో మన వర్తమానానికి పాఠాలు ఉన్నాయి. వారిని గౌరవిస్తే మన పిల్లలకు భవిష్యత్తుకు అవసరమైన మానవత్వాన్ని అందించినట్టే.

వృద్ధులను వదిలేస్తున్న కుటుంబం కేవలం ఒక మనిషిని కోల్పోదు.. ఒక తరం జ్ఞానాన్ని కోల్పోతుంది. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తున్న సమాజం కేవలం ఒక వర్గాన్ని కోల్పోదు.. తన మానవత్వాన్ని కోల్పోతుంది. వృద్ధులను గౌరవించే కుటుంబమే నిజమైన కుటుంబం. వృద్ధులను గౌరవించే సమాజమే నిజమైన నాగరిక సమాజం.

**రేపటి వృద్ధాప్యం మనదే.. కాబట్టి ఈరోజే వృద్ధుల పట్ల మన దృక్పథాన్ని మార్చుకుందాం.**



**డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## కన్నతల్లి రుణం తీర్చలేము
## సింగరేణి తల్లిని మరువలేం

వెట్టిచాకిరితో వర్ధిల్లిన తెలంగాణం
దోపిడీతో అల్లాడిన జనం
నీటి చుక్కకు తండ్లాడిన గ్రామం
ప్రశ్నే దళిత బిడ్డల ఆయుధం
ఊరిడిసిన ఆత్మగౌరవం
బతుకు వేటలో పయనమయ్యే పట్నం

వినబడని ఆత్మీయ పలకరింపు
కడుపు నింపని కష్టం
నడక సాగించే కొత్తగూడెం వైపు
బాల కార్మికుడిగా దొరికే కొలువు
కార్మిక వాడల్లో అన్నీ తెలిసిన ముఖాలే
మాల మాదిగలే..అంతా బంధువులే

స్త్రీ పురుష బేధం లేదు
వయసు పట్టింపు లేదు
చిట్టి చేతులకూ గట్టి పనులు
గని నిండా కమురు వాసన
అందినకాడికి దోచుకునేందుకే
బొగ్గు దొరల కుతంత్రాలు
ఉత్పత్తి లక్ష్యం ఎప్పుడూ
కార్మికులకు ఉరే...

ఆకలితో తరిమిన గ్రామాలు
అక్కున చేర్చుకున్న బొగ్గు హృదయాలు
బాయి పనికి కుదిరితే
దొర దగ్గర పాలేరుతనమే
బట్ట పొట్టకు డోకా లేదు
ప్రాణాలకు ఎప్పుడూ భరోసా లేద
ప్రమాదాలు జరగని రోజు లేదు
రక్తం అంటని బొగ్గు పెళ్ళ లేదు

భూతల్లి గర్భగుడిలో నిత్య సమరం
ప్రమాదాలతో పోటీపడే సహవాసం
విషవాయువు పీల్చి గాలిలో కలిసే ప్రాణం
ఎందరి బతుకులో కూలిన బండ కింద చిద్రం
నీట మునిగి తేలిన శవాలు ఎన్నో
ప్రమాదాలకు చిక్కిన అంగ వైకల్యులేందరో

నల్ల సూర్యులు రోజు సచ్చి బతుకుడే
పెండ్లికి పిల్ల నిచ్చుడు సాహసంగానే ఉండే
బొగ్గు పనిలోకి కార్మికుడి పయనం
దేవుడి గుడిలో మగువ మంగళసూత్రం
కార్మికుడు క్షేమంగా తిరిగి వస్తే మెడలో
ప్రమాదం జరిగితే విసిరే స్మశానములో

హక్కుల సాధనకు అండగా నిలిచి
తిరుగుబాటుకు దారులు పరిచి
పిల్లి కూనల పులులుగా మలచి
కార్మికుల చేతికి ఎర్రజెండా అందించి
సాయుధ పోరుకు సైరను మోగించి
నిజాం పాలకులను గడగడలాడించి
బూటకపు ఎన్కౌంటర్లో నేలకొరిగిన శేషగిరి
సింగరేణి సింహాలు సాగే అమరుడి బాటలో

70వ దశకములో గనుల జాతీయకరణం
బొగ్గు గనుల్లో సాంకేతిక విప్లవం
విదేశీ యంత్రాల రంగ ప్రవేశం
ఓపెన్ కాస్ట్ గనుల ప్రారంభం
గ్రామాలకు పాకిన సమాచారం
సింగరేణికి ఎగబడిన సబ్బండ వర్ణం
కార్మికుల కంచంలో వరి మెతుకులు
సూటు బూటు ధరించిన కూలీలు
పిల్లల చదువు పెళ్లిళ్లకు విదేశాలు
కాలుష్యం తెచ్చిన క్యాన్సర్ రోగాలు
కనీస సౌకర్యాలు నోచని కోల్ బెల్టు ప్రజలు
సింగరేణి కొలువుతో దక్కిన సిరిసంపదలు

పాలకులు సృష్టించిన ఉద్యోగాల కొరత...

పుడమి తల్లి ఒడిలోకి అడుగు
ప్రాణాలు పణంగా బొగ్గులోకి పరుగు
రక్తం చిందించి సృష్టించే విద్యుత్ వెలుగు
మసి బారిన ముఖాలపై చిరునవ్వుల జిలుగు
దేశ రక్షణకు ప్రాణ త్యాగం సైనికులది
సంపద సృష్టిలో ధైర్యం గని కార్మికులది

భయాన్ని జయించిన ధైర్యం
అధికారాన్ని సవాల్ చేసిన వైనం
శ్రమకు వన్నెతెచ్చిన నేర్పరితనం
బొగ్గు రంగాన్ని నిలబెట్టిన కార్మిక వర్గం
రాజకీయ జోక్యం అవినీతికి మార్గం
ప్రణాళిక లోపం సింగరేణికి శాపం

అణగారిన ప్రజల్లో ఆశలు నింపింది
వెలివాడలకు జీవితమిచ్చింది
బానిస బతుకుల మణిహారం
ప్రశ్నకు స్వాగతం ఇచ్చింది
పోరాటానికి పురుడు పోసింది
తిరుగుబాటుకు తిలకం దిద్దింది
అడవికి బాటలు వేసింది
పశుపక్షాదుల కాపాడింది
కచ్చీరు గద్దెను నిలదీసింది
సకలజనుల సమ్మెను నడిపింది
ఢిల్లీ గద్దెను గజగజలాడించింది
తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది
మాలాంటి ఎందరికో ప్రాణం పోసింది
అవనికే సింగరేణి సాక్ష్యం ఇచ్చింది.

25 ఎకరాల భూమి ఉన్న మట్టి మనుషులం
భూస్వామ్య పీడనలో నలిగిన పంచములం
ఎత్తిన కొడవలి మాదాసు బాణయ్య గుణం
అణగారిన బిడ్డల వారసులం.....

కన్నతల్లి రుణం తీర్చలేము
ఆకలి తీర్చిన సింగరేణి తల్లిని మరవలేము.

అమ్మ సింగరేణి... మా తల్లి సింగరేణి..
వందనం.. వేల వేల వందనం.. శతకోటి వందనం

(137 ఏళ్ల సింగరేణి సంస్థ లక్షలాది కుటుంబాలకు బతుకు ఇచ్చింది. భరోసాను ఇచ్చింది. నేడు పదవి విరమణలు తప్ప, ఉద్యోగ కల్పన ఊసేలేని స్థితిని తలుచుకుంటూ..)

మాదాసి రామమూర్తి
సింగరేణి పుత్రుడు
గోదావరిఖని



## సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేన పార్టీతోనే సాధ్యం

- గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి కొట్టాల యాదగిరి



**తూప్రాన్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** సామాజిక న్యాయం జరగాలంటే కేవలం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీతోనే సాధ్యమని గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. నిజామాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "పంచాజన్య సభ"కు హాజరయ్యేందుకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం అన్ని మండలాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. నిజామాబాద్‌లో జరగనున్న పంచాజన్య సభలో కీలక ప్రకటనలు వెలువడనున్నాయని, ప్రజలకు కొత్త ఆశలను నింపుతుందని పేర్కొన్నారు.సామాజిక న్యాయం సాధించడంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వం కీలకమని ఆయన అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాలకు సంబంధించి స్పష్టమైన హామీలు సభలో ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గంలోని పార్టీ కి సంబంధించిన అన్ని పదవులను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, లిగాని రాజు, నరేందర్ రెడ్డి, రాజు, స్వామి, ముఖద్దం సుధాకర్, రాజలింగం, మధు, కుమార్, స్వామి చంద్రకళ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లోగా పరిష్కరించాలి
- చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు
- అధికారులతో మండల స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు మినహా ఏ ఫిర్యాదును కూడా వారం రోజులకు మించి పెండింగ్‌లో ఉంచరాదని అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి సమయం, పనిదినాలను వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలు తమ అర్జీలు, దరఖాస్తులను అధికారులతో పాటు మంత్రి కార్యాలయానికి సంబంధించిన 81858 85127 వాట్సాప్ నంబర్‌కు కూడా పంపవచ్చని తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదుపై బాధ్యతగా స్పందించి, పరిష్కార వివరాలను లిఖితపూర్వకంగా అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యంపై ఆగ్రహం

సమీక్ష సందర్భంగా కొన్ని ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీపనగండ్లకు చెందిన బీచుపల్లి గౌడ్ తన భూమికి సంబంధించిన సర్వే సమస్యపై ఫిర్యాదు చేయగా, రెవెన్యూ అధికారులు జాప్యం చేయడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు.కల్వరాల గ్రామంలోని సర్వే నంబర్ 1లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన ఫిర్యాదుపై స్పందించిన మంత్రి, మొత్తం సర్వే నంబర్‌లోని భూమిని సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించారు. అవసరమైన స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించి, మిగిలిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

### 54 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వీపనగండ్ల మండలానికి 375 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 321 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇంకా 54



మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్‌లో ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీ సమావేశాలు నిర్వహించి, రెండు మూడు రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న 54 మంది లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు. పొరపాటుగా ఎల్3 జాబితాలో నమోదైన అర్హులను పంచాయతీ కార్యదర్శులు గుర్తించి ఎంపీడీవోలకు వివరాలు అందించాలని సూచించారు.హౌసింగ్ లాగిన్‌లోని ఎల్ 3 టు ఎల్1 మోడల్ ద్వారా అర్హులైన వారి ప్రతిపాదనలను వారం రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. ఆర్థిక స్తోమత లేక ఇళ్లు నిర్మించుకోలేని అర్హులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈవో యాదయ్య, స్థానిక సర్పంచ్ పార్వతమ్మ, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో రవీంద్ర భారతి తరహా ఆడిటోరియం

- మధుయాష్కి గౌడ్

**హయత్‌నగర్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** వనస్థలిపురంలో రవీంద్ర భారతి తరహాలో రూ.25 కోట్లతో ఆధునిక ఆడిటోరియం నిర్మించేందుకు కృషి చేస్తున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఎస్.కె.ఎన్. కళాక్షేత్రం ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతు బజార్ సమీపంలోని పార్కులో 150 మంది విద్యార్థులతో నిర్వహించిన సంగీత, నృత్య రూపక కార్యక్రమానికి మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ సంగీతం, నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించిన చిన్నారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. వనస్థలిపురంలో రవీంద్ర భారతి తరహా ఆడిటోరియం నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో




నిర్మించనున్న ఈ ఆడిటోరియానికి త్వరలోనే నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. వనస్థలిపురంలో సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తానని మధుయాష్కి గౌడ్ హామీ ఇచ్చారు. కళలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, డివిజన్ అధ్యక్షులు కొల్లూరు శ్రీనాథ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రమాకాంత్ గుప్తా, డివిజన్ మాజీ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, మకుటం సదాశివుడు, డీసీసీ ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు స్వర్ణ మాధవి, దేరంగుల కృష్ణ, జిల్లా స్పోక్స్‌పర్సన్ దాము మహేందర్ యాదవ్, కార్యదర్శులు రిజ్వాన్, నరేష్ గుప్తా, నాయకులు శశికాంత్, ఇర్ఫాన్, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సూలాపాణి, వెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం



**శామీర్‌పేట్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ 15వ వార్డులో, మున్సిపల్ జనరల్ నిధుల ద్వారా 8 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అలియాబాద్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ కార్య క్రమంలో వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ తాళ్ల స్వప్న రాంప్రసాద్, కౌన్సిలర్లు కైరా గణేష్, తలారి మౌనిక బాబు, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, మున్సిపల్ ఏఈఈ సనా షాహీన్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపడుతూ, ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

## చోరీ కేసులో ఒక నిందితుడి అరెస్ట్

- బంగారు ఆభరణాల స్వాధీనం
- పట్టణ సీఐ పరమేశ్వర్

**తాండూరు అగస్టు 31 (జనంసాక్షి) :** చోరీ కేసులో ఒక నిందితుడి అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని పట్టణ సీఐ పరమేశ్వర్ వెల్లడించారు.తాండూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాల్మీకి నగర్‌లో రెండు రోజుల క్రితం దారుణ చోరీ సంఘటన చోటుచేసుకుంది. సుమారు 50 ఏళ్ల మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో, అదే ఇంట్లో పనిచేసే పనిమనిషి భర్త ముగ్గప్ప, అతని స్నేహితుడు సంజీవ్ ఆమె ఒంటరిగా ఉన్న



విషయాన్ని గమనించారు. పథకం ప్రకారం ఇంటికి వచ్చి తలుపు కొట్టారు. బాధితురాలు తలుపు తీయగానే ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి కింద పడేశారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, నల్లపూసల దండను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనపై బాధితురాలు తాండూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు శివాజీ చౌక్ వద్ద నిందితుడైన సంజీవ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి చోరీకి గురైన బంగారు ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ కేసులో మరో ప్రధాన నిందితుడైన ముగ్గప్ప ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## రహదారులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- జీడిమెట్ల ఉప కమిషనర్ శంకర్ సింగ్



**నిజాంపేట్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ మైన్ రోడ్ గోదావరి ఒమ్స్ నుంచి సుచిత్ర సర్కల్ వరకు ఉన్న రహదారి ఆక్రమణలను అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలో చేరుకుపల్లి కాలనీలోని అక్రమ కట్టడాలు కూల్చి వేయడం జరిగినది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలు కట్టినిచో అట్టి అక్రమ కట్టడాలుపై కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు . ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో ఉప కమిషనర్ . డి. శంకర్ సింగ్ , అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టిపిఎస్) మచందర్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు. రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## పొలాల్లో శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయి పరిశీలన

**నారాయణపేట, ఆగస్టు 31 (జనం సాక్షి) :** నారాయణపేటమండలంలోని పెరపల్ల, శాసన్‌పల్లి గ్రామాల్లో రైతుల పత్తి, వరి, కంది పంటలను సోమవారం క్షేత్ర సందర్శనలో భాగంగా డా. ఈటెల సత్య నారాయణ, ఏఆర్ఎస్ తాండూర్ శాస్త్రవేత్తలు స్వాతి, మాణిక్య మిన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో కనిపిస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి గల కారణాలను గుర్తించారు.పత్తి పంటలో కొన్ని ప్రాంతాల్లో పారావిల్ట్ ఆకస్మిక వడలు తెగులు లక్షణాలను గుర్తించి పంట లో నీటి నిర్వహణ, నేల పరిస్థితులు,పంట ఆరోగ్యం పై రైతులకు అవగాహన కల్పించారు.అలాగే వరి పొలాల్లో సల్ఫైడ్ ప్రభావం లక్షణాలను గుర్తించి, నీటి యాజమాన్యం తగిన వ్యవసాయ చర్యలను పాటించాలని సూచించారు. పంటల ఎదుగుదల,దిగు బడులు మెరుగుపడేందుకు సిఫారసు చేసిన ఎరువుల ను సరైన మోతాదులో,సరైన సమయంలో వినియోగించడం అత్యంత ముఖ్యమని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు.అవసరానికి మించి ఎరువులు వినియోగించకుండా,పంట దశను బట్టి సమతు ల్య ఎరువుల యాజమా న్యాన్ని పాటించాలని సూచించారు.కంది పంటను కూడా పరిశీలించి, ప్రస్తుతం పంట ఎదుగుదల పరిస్థి తులను బట్టి తగిన యాజ మాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచనలు చేశారు. పంటల్లో సమస్య లు




కనిపించిన వెంటనే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను సంప్ర దించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచిం చారు.ఈ క్షేత్ర సందర్శన ద్వారా రైతుల పొలాల్లోనే పంట సమస్యలను గుర్తిం చి, శాస్త్రీయ పరిష్కారాల ను అందించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు డా. ఈటెల సత్యనారాయణ తెలిపారు.

# యాచారంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా..

- ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

**యాచారం, ఆగస్టు 31 (జనం సాక్షి) :** సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం యాచారం మండల కమిటీ ఆధ్వర్యంలో 'మండల ప్రజావాణి' సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూ మండలం పరిధిలోని స్థానిక, భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్మన్నగూడ నుండి పెత్తుల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు వెంటనే పూర్తి చేయాలి. మండలంలోని అన్ని గ్రామాలు, తండాలకు రోడ్లు నిర్మించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. దేవాదాయ భూముల పట్టాలు: నంది వనపర్తి, సింగారం, కురిమిద్య, తాడిపర్తి గ్రామాల్లో ఉన్న 1400 ఎకరాల దేవాదాయ భూములను కౌలు రైతుల పేరు మీద పట్టా చేసి, పట్టాదారు పాసుబుక్కులు మంజూరు చేయాలి.పార్మసిటి నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించి, వారికి పూర్తి హక్కులు, సౌకర్యాలు కల్పించాలి.చింతపట్ల గ్రామంలోని సర్వే నంబర్లు 209, 210లలో గల రెండు ఎకరాల భూమిని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి. స్మశాన వాటిక భూమి పరిరక్షణ: మంథన్ గౌరెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 104లో ఉన్న 1-05 గుంటల స్మశాన వాటిక భూమిని



సర్పంచ్ కబ్జా చేశారని, దాన్ని వెంటనే సర్వే చేసి హద్దులు నాటి పరిరక్షించాలి. పెరిగిన జనాభాకు అనుగుణంగా అన్ని గ్రామాలకు కృష్ణా నీటిని సరఫరా చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి.సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజలను చైతన్యపరిచి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. చందు నాయక్, ఆలంపల్లి జంగయ్య, మండల కమిటీ సభ్యులు వెంకటయ్య, బాలరాజ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీమన్నారాయణ, మాజీ సర్పంచ్ ఎం. భాషయ్య, శాఖ కార్యదర్శులు రమేష్, జంగయ్య, సురేష్, నాయకులు జంగారెడ్డి, రాములు, కుమార్, భాస్కర్, పంతు నాయక్, నందు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు సంగీత, పాండు
- కలెక్టరేట్ ప్రజావాణికి 41 ఫిర్యాదులు

**సంగారెడ్డి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు,



వినతులు అందాయనీ, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్ 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** విద్యార్థులకు చిన్ననాటి నుంచే డబ్బు వినియోగం, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.సోమవారం జిల్లా కేంద్రం లోని ఎర్ర గుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశా లలో స్వత: పాండేషన్ సౌజన్యంతో జిల్లాలోని ఎంఈవో, హెచ్ ఎం లకు ఫైనాన్స్ లిటరసీ,మనీ మంత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమానికి జిల్లాలోని 88 ప్రాథమికోన్నత పాఠ శాలలు, ఎంపిక కావడం విద్యార్థులతో పాటు ఉపా ధ్యాయులకు కూడా గొప్ప అవకాశమన్నారు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, సంపాదించిన డబ్బును సక్రమంగా పొదు పు చేయడం, సరైన విధం గా పెట్టుబడి పెట్టడం, భవి ష్యత్ అవసరాలకు అను గుణంగా ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు.ప్రస్తుతం సోషల్ మీడియా,టెక్నాలజీ ద్వారా త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆకర్షణీయమైన ప్రకట నలు, తప్పుడు పెట్టుబడి పద్ధతులు విద్యార్థులు,యువతను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అత్యాశకు లోనై ఆర్థికంగా నష్టపోయి, సమస్యలను ఎదుర్కొంటున్న ఘటనలు మనం చూస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంట ి పరిస్థితులను నివారించేందుకు విద్యార్థులకు ఆర్థిక విషయాలపై సరైన అవగా హన కల్పించాల్సిన అవ సరం ఉందన్నారు.పాఠశాల స్థాయిలోనే ఆర్థిక అక్షరాస్య తను సాధారణ విద్యా విధా నంలో భాగంగా ప్రవేశపెట్టా ల్సిన అవసరం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. 12వ తరగతి వరకు చాలా మంది విద్యార్థులు స్వయం గా పెద్ద మొత్తంలో డబ్బు ను నిర్వహించే అవకాశం ఉండదని, భవిష్యత్తులో ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చేతికి వచ్చినప్పుడు దానిని ఎలా సక్రమంగా వినియోగించాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అన్నారు.స్వతహ ఫౌండే షన్ సహకారంతో జిల్లాలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం అమలు కావడంఅభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని మరిన్ని పాఠశాల లకు విస్తరించేలా రానున్న రోజుల్లో ప్రణాళిక రూపొంది స్తామని తెలిపారు. ఉపాధ్యాయులు తమ రెగ్యులర్ డే ప్లాన్, సబ్జెక్ట్ ప్లాన్‌లతో పాటు ఫైనాన్ని యల్ లిటరసీకి కూడా ప్రత్యేక సమయం కేటాయిం చాలని కలెక్టర్ సూచించా రు. హెడ్‌మాస్టర్లు ఈ కార్య క్రమాన్ని పాఠశాల స్థాయి లో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొం దించుకోవాలని కోరారు.

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే భాషలో రూపొందించిన పుస్తకాలు, బోధనా సామగ్రి వెనుక ఎంతోమంది కృషి ఉందని, వాటిని విద్యార్థులకు నాణ్యమైన రీతిలో అందిం చడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు.భవిష్యత్తులోపాఠశాలలను ఆకస్మికంగాసందర్శించినప్పుడు ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం ఏ విధంగా అమలవుతుందో పరిశీలిస్తానని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ కార్యక్ర మాన్నిఉపాధ్యాయులందరూ బాధ్యతగా తీసుకొని విజయవంతంగా అమలు చేస్తారనే నమ్మకం తనకు ఉందని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఏ ఎం వో విద్యా సాగర్, ఆ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు పెద్దపీట

- 83 ఉన్నత పాఠశాలల కు శానిటరీ న్యాప్కిన్ ఇన్సినరేటర్ల పంపిణీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతా వరణం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రత్యేక చొరవతో జిల్లాలో బాలికల నమోదు ఉన్న 83 ఉన్నత పాఠశాలలకు సోమవారం శానిటరీ న్యాప్కిన్ ఇన్సినరేటర్లను స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికల రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఇన్సినరేటర్ల వినియోగంతో శానిటరీ వ్యర్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసి పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించవచ్చని పేర్కొన్నారు.బాలికలకు వ్యక్తిగత రుతుక్రమ ఆరోగ్యం, శానిటరీ వ్యర్థాల సురక్షిత నిర్వహణపై అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గోవింద రాజు, అకడమిక్ మానిట రింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, జెండర్ కోఆర్డినేటర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ఉన్నత లక్ష్యాలను నిర్దేశిం చుకుని, వాటి సాధన కోసం క్రమశిక్షణతో నిత్యం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విద్యార్థినులకు సూచించారు.సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఇంటర్మీ డియట్ విద్యార్థినులతో ముచ్చటించారు.ఈ సందర్భంగావిద్యార్థినులను ఒక్కొక్కరినీ వారి ఇష్టమైన సబ్జెక్టులు, భవిష్యత్ లక్ష్యా ల గురించి అడిగి తెలుసు కున్నారు.ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదు వుకోవాలని కలెక్టర్ సూచిం చారు. ముఖ్యంగా నీట్ కు ఇప్పటి నుంచే పక్కా ప్రణా ళికతో సిద్ధం కావాలని, ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి చదువుతో పాటు పునశ్చరణ, మాక్ టెస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థాయికి ఎదగ డానికి కష్టపడి పనిచేయా లని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చదువులో లేదా వసతి, భోజనం,ఇతర సౌకర్యాల కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థినులతో కలెక్టర్ స్వయంగా ముచ్చ టించడం పట్ల వారు సంతో షం వ్యక్తం చేశారు.

## గద్వాల్ అభివృద్ధికి సౌకర్యాలు కల్పించాలి

- సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్, ఈఎస్ఐ ఆసుపత్రి, మేళ చెరువు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి వినతి



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 31 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా, వైద్య సౌకర్యాల కల్పన కోసం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే మోహన్ రావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నేత వెంకటాద్రి రెడ్డి సీనియర్ సిటిజన్ ఫోరం తరఫున వినతి పత్రాలు అందజేశారు. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే ముఖ్యమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లకు గద్వాలలో హాల్ట్ కల్పించాలని సీనియర్ సిటిజన్ ఫోరం అసోసియేషన్ కోరింది. ఈ మేరకు గతంలో 26-02-2024న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు మెమోరాండం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంది. ఈ సమస్యపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే బోర్డు, రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. గద్వాల రైల్వే స్టేషన్ నుంచి ప్రతిరోజూ సుమారు 3,500 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, స్టేషన్ ద్వారా రోజుకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ కల్పిస్తే గద్వాలతో పాటు అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు, పీజేపీ డ్యామ్ తదితర పర్యాటక ప్రాంతాలకు భక్తులు, పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా గద్వాల ప్రాంత ప్రజలు, ఉద్యోగుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని 100 ఎకరాల భూమిలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. ఈ ఆసుపత్రి ఏర్పాటైతే గద్వాలతో పాటు కర్నూలు, రాయచూర్ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలబెజ్జంకిలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి.

# నత్తనడకన బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణం

- ప్రజలకు తప్పని తిప్పలు
- పనుల జాప్యంతో నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు, స్థానికులు
- సర్వీస్ రోడ్లు అధ్వాన్నం
- దుమ్ము, ధూళి, గుంతలతో ప్రమాదాలు
- వేగవంతం చేయాలని ప్రజల డిమాండ్



**బాలానగర్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లాలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి 44పై బాలానగర్ మండల కేంద్రంలోని చావు రాస్తా కూడలిలో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల కలగా ఉన్న ఫ్లై ఓవర్ మంజూరు అయినా, పనులు ఆలస్యం కావడంతో ప్రజలకు వరంగా కావాల్సిన బ్రిడ్జి ఇప్పుడు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రమాదాలకు నిలయం.. పరిష్కారమే సమస్యగా..**

బాలానగర్ చౌరస్తా గతంలో వందలాది ప్రమాదాలకు నిలయంగా ఉండేది. ఈ కూడలిలో ఇప్పటివరకు 100 కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఫ్లై ఓవర్ నిర్మించాలని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫ్లై ఓవర్ మంజూరు చేశాయి. పనులు ప్రారంభమయ్యాయని సంతోషించిన ప్రజలకు ఇప్పుడు పనుల ఆలస్యం, అస్తవ్యస్తమైన ట్రాఫిక్ మళ్లింపు కారణంగా తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి.

**సర్వీస్ రోడ్డులో నరకం చూస్తున్న జనం**

ప్రధాన రహదారిని బారికేడ్లతో మూసివేసి వాహనాలన్నింటినీ ఇరువైపులా ఉన్న ఇరుకైన సర్వీస్ రోడ్ల మీదుగా మళ్లించారు. అయితే ఆ సర్వీస్ రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా తయారయ్యాయి.

**గంటల తరబడి ట్రాఫిక్ జామ్**

హైదరాబాద్ నుండి మహబూబ్ నగర్, కర్నూలు, బెంగళూరు వెళ్లే వందలాది లారీలు, బస్సులు, కార్లు ప్రతిరోజూ ఈ దారిలోనే వెళ్తుంటాయి. ఫ్లై ఓవర్ పనుల కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాల్సిన అంబులెన్సులు కూడా జామ్ లో చిక్కుకుని రోగులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

ఇప్పటికైనా జాతీయ రహదారుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ స్పందించి ఫ్లై ఓవర్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తాత్కాలికంగా సర్వీస్ రోడ్లను బాగుచేసి, దుమ్ము లేకుండా నీళ్లు చల్లించడం, రాత్రి వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని బాలానగర్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్‌కు జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఫీజుల సమస్య కాదని.. 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కళాశాలలకు ఫీజుల బకాయిలు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయకుండా, వెంటనే సర్టిఫికెట్లు అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో (జీవో) జారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు



సతీష్ యాదవ్, జిల్లా నాయకులు మధు, బి.ఎల్లయ్య, సూర్య ప్రకాష్, గంధం రవి, బి.ఆంజనేయులు, శివకుమార్, ఈ.రవి, శాంతన్న, రమేష్, స్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అనామలీస్, నాన్-లింక్డ్ కేసులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ,ప్రస్తుతం కొనసాగుతున్న క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా అనంతరం గుర్తించిన కేసులపై సమీక్షించారు.జిల్లాలో మండలాల వారీగా గుర్తించిన అనామలీస్, నాన్-లింక్డ్ కేసులు, జారీ చేసిన నోటీసులు, నోటీసులు అందించిన వారి వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల పూర్తి సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీలో అవసరమైన ఆధా రాలతో హాజరయ్యేలా బీ ఎల్ వో లు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శ కాల ప్రకారం ఆమోదించ బడిన డాక్యుమెంట్లలో ఏదైనా ఒకదాన్ని సమర్పించినప్పుడు, సంబంధిత పత్రాలను పరిశీలించి స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్లిష్టమైన కేసులను ప్రత్యేకం గా గుర్తించి, అవసరమైనసందర్భాల్లోఉన్నతాధికారుల మార్గదర్శకాలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతిని ధులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎన్నికల విభా గం అధికారిని జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధు లు సుదర్శన్ రెడ్డి, మహ్మద్ సలీం, రాఘవ చౌదరి, రాములు, వెంకట్రామ్ రెడ్డి, కెంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**బెజ్జంకి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** బెజ్జంకి మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని,బెజ్జంకి,తోటపల్లి పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సీపీఎం పార్టీ తరుపున తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి,తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ బెజ్జంకి,తోటపల్లి పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరతతో వైద్యం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.బెజ్జంకి పీహెచ్‌సీలో సూపర్‌వైజర్,ముగ్గురు స్టాఫ్ నర్సులు,నలుగురు ఏఎన్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి అనీ అన్నారు.ఆయుష్‌కు సంబంధించిన ఇద్దరు అధికారులను సిద్దిపేటకు డిప్యూటేషన్‌పై పంపించారని,తోటపల్లి పీహెచ్‌సీలో ఫార్మాసిస్టు,స్టాఫ్ నర్స్,ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేసినా సమస్య పరిష్కారం కాలేదు అనీ అన్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం పార్టీ తరఫున



డిమాండ్ చేస్తున్నాము అనీ అన్నారు.బెజ్జంకిలో 30 పడకల ఆసుపత్రిని నిర్మించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సీపీఎం పార్టీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నాము అని అన్నారు.కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బోనగిరి లింగం,బోనగిరి పరశురాములు,కుంట సత్తయ్య,సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో కీలకమైన డిమాండ్‌గా మేళ చెరువు క్రాస్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ వంతెనను రాయచూర్ బైపాస్ రోడ్డు, మంత్రాలయం వైపు వెళ్లే రహదారులతో అనుసంధానం చేస్తే రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రాంతీయ రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. రైల్వే సౌకర్యాల విస్తరణ, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు, ఆర్వోబీ నిర్మాణం ఈ మూడు పనులు పూర్తయితే గద్వాల్ జిల్లా అభివృద్ధికి, పర్యాటక రంగానికి, వాణిజ్య కార్యకలాపాలకు మరియు ప్రజల సౌకర్యాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మోహన్ రావు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ అంశాలపై ప్రత్యేకంగా స్పందించి సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన కోరారు. అదేవిధంగా గద్వాల జిల్లాకు తలమానికమైన జోగులాంబ ఆలయ అభివృద్ధి కొరకు అక్కడి ఆదాయ వనరులను పరిగణనకు తీసుకొని దేవస్థానం నిర్వహణ కొరకు డిప్యూటీ కమిషనర్ లేదా అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో రాష్ట్ర దేవాదాయ శాఖకు సిఫారసు చేయాలని, అలాగే ఇక్కడి నవబ్రహ్మాలయాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున యునెస్కో గుర్తింపు కృషి చేయాలని కోరారు.

## మేలైన యాజమాన్య పద్ధతులతోనే చెరుకులో అధిక దిగుబడులు



**మొగుడంపల్లి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా చెరుకులో అధిక దిగుబడులు సాధించవచ్చని బసంతపూర్ చెరుకు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త విజయకుమార్ తెలిపారు. సోమవారం మొగుడంపల్లి మండలం గుడిపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి, వివిధ రకాల చెరుకు తోటలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ చెరుకు సాగులో భూసార పరీక్షలు చేయించి, వాటి ఆధారంగా అవసరమైన ఎరువులను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా జింక్, బోరాన్, మెగ్నీషియం, సల్ఫర్‌తో పాటు మొత్తం 16 రకాల పోషకాలను సమతుల్యంగా అందించినప్పుడే పంటలో మంచి ఎదుగుదలతో పాటు అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు.అలాగే సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, కోడిపెంట తదితరాలను భూమిని దున్నే సమయంలోనే కలిపి వినియోగించాలని సూచించారు. భూసారాన్ని మెరుగుపరిచేందుకు నాలుగు సంవత్సరాలకు ఒకసారి పచ్చిరొట్ట ఎరువులను సాగులో భాగంగా ఉపయోగించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త విజయకుమార్‌తో పాటు వ్యవసాయ అధికారి విజయలక్ష్మి మంగళంపల్లి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, గుడిపల్లి సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, రైతులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సంతురెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలీమ్, కృష్ణారెడ్డి, జగన్నాథం, సద్దాం, జైపాల్, షరీఫ్‌పటేల్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ అడవి బిడ్డకు అంతర్జాతీయ సదస్సుకు అవకాశం

- గిరిజన అడవి బిడ్డని ఆహ్వానించిన స్పెయిన్ దేశం
- అంతర్జాతీయ సదస్సుకు అప్పరాజుపల్లి గ్రామవాసి ప్రొఫెసర్ మోహన్ ధారావత్



**గూడూరు, ఆగస్టు31 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పలరాజుపల్లి గ్రామం దుబ్బతండాకు చెందిన మాజీ జెడ్పీటీసీ తేజ నాయక్ కుమారుడైన దారావత్ మోహన్ మారుమూల ప్రాంతమైన దుబ్బతండా ప్రభుత్వ పాఠశాలలో చదివి,ఈ ఉన్నత స్థాయికి చేరుకొని, అడవి ప్రాంతంలో బస్సులు లేకపోయినా సరైన సౌకర్యాలు లేక నేను ఏదో సాధించాలని గ్రామం నుంచి పట్టణానికి వచ్చి ఉన్నత చదువులు చదివి ప్రొఫెసర్ గా విద్యార్థులకు పాఠాలు చెబుతూనే అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ కుల, జాతి నిర్మూలణ కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్న మోహన్ ధరావత్‌ను ప్రపంచ అంతర్జాతీయ సదస్సులలో వేదికలలో ప్రసంగించే అవకాశం కల్పించిన స్పెయిన్ యూనివర్సిటీ వారికి రుణపడి ఉంటానని మోహన్ ధరావత్ ఆనందం వ్యక్తం చేశారు. 'ఇంటర్నేషనల్ సోషియలాజికల్ అసోసియేషన్ (ఐఎస్ఏ ఆర్సీ 41)లోని రిసెర్చ్ కమిటీ ఆన్ సోషియాలజీ ఆఫ్ పాప్యులేషన్ తరఫున, స్పెయిన్ లో జరగబోయే అంతర్జాతీయ సదస్సులో వ్యక్తిగతంగా పాల్గొనవలసిందిగా టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో ఆచార్యులుగా పనిచేస్తున్న అప్పరాజుపల్లి గ్రామం, మహబూబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ మోహన్ ధారవత్ ని ఆహ్వానించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ మాడ్రిడ్ నిర్వహించే ప్రపంచ ఉత్తర, దక్షిణ దేశాల ప్రాంతాలలో జనాభా గతిశీలత నిర్మాణంలో మార్పులు,వలసలు, మారుతున్న ప్రదేశాలు అనే పేరుతో నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సు 2026 సెప్టెంబర్ 10 మరియు 11 తేదీలలో, స్పెయిన్‌లోని కార్లోస్ యూనివర్సిటీ ఆఫ్ మాడ్రిడ్, గెటాఫే క్యాంపస్ స్పెయిన్ లో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ మోహన్ దారావత్ కులం, వలసలు, అసమానతలు ప్రపంచవ్యాప్తంగా కుల వ్యవస్థ కొనసాగింపు, కుల వ్యతిరేక ఉద్యమాలు అనే అంశం మీద ప్రసంగించబోతున్నారు.

## ఒగ్గుకథ కళారంగంలో 'ప్రైడ్ ఆఫ్ భారత్' అవార్డు

- అందుకున్న పోశాల చంద్రమౌళి గౌడ్



**టేకుమట్ల ఆగస్టు 31 (జనంసాక్షి) :** మూడు దశాబ్దాలుగా ఒగ్గుకథ కళను తన జీవితంలో భాగంగా మలుచుకుని, జానపద కళా వైభవాన్ని సజీవంగా నిలబెడుతూ వస్తున్న టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు పోశాల చంద్రమౌళి గౌడ్ 'ప్రైడ్ ఆఫ్ భారత్ ఇంటర్నేషనల్ అవార్డు'ను అందుకున్నారు. ఒగ్గుకథ కళారంగానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. 30 సంవత్సరాలుగా ఒగ్గుకథ కళాకారుడిగా తనదైన ముద్ర వేసుకున్న చంద్రమౌళి గౌడ్, తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో సైతం ఒగ్గుకథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను అలరించారు. సంప్రదాయ జానపద కళకు తన గళంతో జీవం పోస్తూ, పురాణ గాథలు, సామాజిక అంశాలను ఒగ్గుకథ రూపంలో ప్రజలకు చేరవేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, ఒగ్గుకథ కళను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఎందరో ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి కొత్త కళాకారులను తీర్చిదిద్దారు. తనకు తెలిసిన కళా మెళకువలను యువతకు నేర్పుతూ, కనుమరుగవుతున్న జానపద కళల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ కళా ప్రస్థానంలో ఒగ్గుకథకు చంద్రమౌళి గౌడ్ అందించిన సేవలకు గుర్తింపుగా లభించిన 'ప్రైడ్ ఆఫ్ భారత్ ఇంటర్నేషనల్ అవార్డు' ఆయన కళా జీవితంలో మరో మైలురాయిగా నిలిచింది. వెలిశాల గ్రామానికి చెందిన కళాకారుడికి అంతర్జాతీయ స్థాయిలో ఈ గౌరవం దక్కడంపై గ్రామస్తులు, జానపద కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ పోశాల చంద్రమౌళి గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

## విముక్తి జాతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 31(జనంసాక్షి) :** వెనకబడిన తరగతులలో విముక్తి జాతుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని బి సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ సత్య శారద దేవి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ కింద అనేక సంచార, అర్ధసంచార జాతులు అణచివేతకు గురయ్యాయని ఆమె తెలిపారు. ఈ జాతులను ఆ చట్టం నుంచి విముక్తి చేసి డీ-నోటిఫైడ్ ట్రైబ్స్ (విముక్తి జాతులు)గా గుర్తించిన నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 31న విముక్తి జాతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంచార, అర్ధసంచార, విముక్తి జాతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, గృహ వసతి, సామాజిక భద్రత వంటి రంగాల్లో వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి పుష్ప లత, సంబంధిత శాఖల అధికారులు, వివిధ జాతుల కుల సంఘాల నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31(జనంసాక్షి) :** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ లతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో గంజాయి విక్రయం, వినియోగంపై 3 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసిన 36 మంది రైతులకు రైతుబంధు నిలిపివేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు చేసే వారిని గుర్తించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన చేపట్టాలని, విద్యాసంస్థల పరిధిలో 100 మీటర్ల లోపు పాన్, కిరాణా, బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలలో చదివే విద్యార్థులకు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని, ప్రతిరోజు విద్యార్థుల ప్రవర్తన గమనించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆటో, లారీల వాహన తనిఖీ నిర్వహించాలని, మెడికల్ దుకాణాలలో అధిక మోతాదులో మత్తుకు సంబంధించిన మందులను తనిఖీ చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గంజాయి సాగు చేసే వారికి రైతుబంధు నిలిపివేస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి మానసిక వైద్య నిపుణులు ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిల్లర కొట్టేస్తున్నారు!

- పింఛన్ పంపిణీ వ్యవస్థలో అవినీతి జలగలు
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం
- చర్యలు చేపట్టాలని లబ్ధిదారుల డిమాండ్



**వెంకటాపూర్ (రామప్ప),ఆగస్టు31(జనం సాక్షి):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన పేదలకు ప్రభుత్వం చేయూత పథకం కింద పింఛన్ అందిస్తోంది.పట్టణ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాల ద్వారా,గ్రామీణ ప్రాంతాల్లో తపాలా కార్యాలయాల ద్వారా పంపిణీ జరుగుతోంది. ఒక్కో లబ్ధిదారుడికి పింఛన్ అందించినందుకు పంపిణీ నిర్వాహకులకు ప్రభుత్వం రూ.7 చొప్పున పారితోషికం ఇస్తోంది.అయినప్పటికీ వెంకటాపూర్ మండలంలోని కొన్ని గ్రామాల్లో నిర్వాహకులు లబ్ధిదారుల పింఛన్ సొమ్ములో రూ.16 చొప్పున చిల్లర నొక్కేస్తున్నారు. నిలదీస్తే చిల్లర లేదని, రేపు మాపు అంటూ తిప్పుకుంటారేమోననే భయంతో లబ్ధిదారులు ఇచ్చినంత తీసుకుని మౌనంగా ఉంటున్నారు .ఇదే అదునుగా తీసుకొని పింఛన్ పంపిణీ వ్యవస్థలోని కొందరు అవినీతి జలగలుగా మారి నిరుపేదల కడుపు కొడుతున్నారు. ఇదంతా సంబంధిత శాఖ అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో నిర్వాహకుల ఆగడాలు రోజు రోజు కి శృతిమించుతున్నాయి.మండలంలోని ఓ గ్రామానికి చెందిన వితంతు మహిళ హైదరాబాద్ లో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పింఛన్ ఇస్తున్నారని తెలిసి స్వగ్రామానికి వచ్చిన ఆమెకు నిర్వాహకులు రూ.16 తగ్గించి రూ.2000 మాత్రమే ఇచ్చారు. అదేవిధంగా మరో గ్రామానికి చెందిన వృద్ధుడికి కూడా రూ.16 తగ్గించి ఇచ్చినట్లు తెలిసింది.ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛన్ అందిస్తోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు పంపిణీదారులు పెద్ద నోట్లతో రూ.2000 ఇచ్చి మిగిలిన రూ.16 చిల్లర లేదనే సాకుతో జేబులో వేసుకుంటున్నారు. నిలదీస్తే ప్రయాణ ఖర్చులు అవుతున్నాయని సాకులు చెబుతున్నారు.ఒక్కో కార్యాలయం పరిధిలో 3 నుంచి 4 గ్రామాల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో లబ్ధిదారులు ఉండటంతో ఒక్కొక్కరి నుంచి రూ.16 చొప్పున మండల వ్యాప్తంగా నెలకు లక్షల రూపాయలు నొక్కేస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పింఛన్ పంపిణీ వ్యవస్థలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి చిల్లర నొక్కేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణి పట్ల నిర్లక్ష్యం పట్ల వీడని పలు శాఖల అధికారులు

- ఫారెస్ట్, ఇరిగేషన్, ఆర్అండ్ బీ ఉద్యానవన శాఖలు
- మూడు ప్రజావాణిలకు గైర్హాజరు
- ప్రజావాణి కి హాజరు గాని అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ




**నడికూడ, ఆగస్టు 31 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నడికుడ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి సమయ పాలన పాటించకుండా కొన్ని శాఖల అధికారులు హాజరు కాగా వారిని సమయపాలన పాటించాలని సమయపాలన పాటించని అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆలస్యంగా వచ్చినందున తమరు రిజిస్టర్ లో సంతకాలు పెట్టరాదని వారిని హెచ్చరించారు అదే విధంగా మరికొన్ని శాఖల అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మూడు ప్రజావాణి కార్యక్రమాలకు గైహాజరు కావడం జరుగుతున్నది ఫారెస్ట్ శాఖ అధికారులు. ఇరిగేషన్ శాఖ అధికారులు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు. ఉద్యానవన శాఖ అధికారులు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాలేదు మూడు ప్రజావాణి కార్యక్రమాలకు గైహాజరైన ఈ నాలుగు శాఖల అధికారులపై తక్షణమే జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ తెలిపారు.

**గైర్హాజరైన నాలుగు శాఖల అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం**

మండలంలోని ప్రజా సమస్యల కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటివరకు మండల పరిషత్ లో నిర్వహించిన మూడు ప్రజావాణి కార్యక్రమాలకు ఫారెస్ట్ ఇరిగేషన్ ఆర్ అండ్ బి ఉద్యానవన శాఖ అధికారులు గై హాజరు కావడం సరైన పద్ధతి కాదు అని వారిపై జిల్లా అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇట్టి శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటేనే మరో శాఖ అధికారులు ప్రజావాణి కి హాజరవుతారని మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు . తెలియజేశారు మండలంలో ఫారెస్ట్ అధికారులు అసలు ఉన్నారా..?వారు ఎవరు అనేదినడి కూడ మండలం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఏ ఒక్క ప్రజా ప్రతినిధికి ఆ శాఖ అధికారులు తెలువదని గ్రామాలలో మరియు రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా చెట్లు నరుకుతున్న పచ్చదనం పరిరక్షణ అనే విధానం పాతర పెడుతున్న ఫారెస్ట్ అధికారులు మాత్రం కంటికి కనబడ్డ దాఖలాలు లేవు అని ఫారెస్ట్ శాఖ అధికారులపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు.



## భీమినిలో అర్ధరాత్రి దొంగల కలకలం

- వరుసగా మూడు చోట్ల దొంగతనాలు
- డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీ

**భీమిని, ఆగస్టు 31 (జనంసాక్షి) :** భీమిని మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. సుమారు లక్ష రూపాయల వరకు దోచుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. భీమిలి ఎస్ఐ కోటేశ్వర్ తెలిపిన వివరాలు ప్రకారం బ్రాండ్ షాప్ కి ఎదురుగా ఉన్న ధనుంజయ్ కిరాణం తో పాటు వినాయక ఫర్టిలైజర్, తిరుమల ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. గుణపాలతో షట్టర్లను పగలగొట్టి నగదును దోచుకెళ్లారని 99 వేల రూపాయల చోరీ జరిగినట్లు గుర్తించామని తెలిపారు.

## డోలి సంధ్య కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి

- నిందితుడిని అరెస్టు చేసి కఠినమైన శిక్ష విధించాలి
- బస్టాండ్ సెంటర్ వద్ద బైఠాయింపు, కలెక్టర్ వాహనం అడ్డగింపు
- తమ కుటుంబానికి న్యాయం జరగడం లేదని డోలి సంధ్య తమ్ముడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం



**మహబూబాబాద్, ఆగస్టు 31(జనం సాక్షి):** మహబూబాబాద్ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ కేసముద్రం రోడ్డు వద్ద డోలి సంధ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేయగా అటువైపుగా వెళ్తున్న కలెక్టర్ వాహనాన్ని కుటుంబ సభ్యులు ఆపి వారి బాధను వ్యక్తం చేయడం జరిగింది. అదే సమయంలో తీవ్ర బాధలో ఉన్న డోలి సంధ్య తమ్ముడు డోలి రాజేష్ నడిరోడ్డుపై వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా అక్కడ ఉన్న పోలీస్ అడ్డుకొని వారిని పిఎస్ కి తరలించారు.ఆ తర్వాత బస్టాండ్ సెంటర్ వద్ద బైఠాయించి సుమారు గంటపాటు ఆందోళన చేశారు, ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు, డి ఎస్ ఎఫ్ ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ డోలి సంధ్య మరణించి నేటికి 16 రోజులు కావస్తున్న నేటికీ నిందితున్ని అరెస్టు చేయకపోవడం పోలీసుల అలసత్వానికి నిదర్శనమని అన్నారు. నిందితుడు శ్యామ్ కి రాజకీయ అండదండలు ఉండడం వల్లనే పోలీసులు ఈ కేసును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించి డోలి సంధ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వెంకన్న, స్వాతి, విద్యార్థి సంఘాల నాయకులు వెలుగు శ్రావణ్, బోనగిరి మధు, కే లోతు సాయికుమార్, సూర్య ప్రకాష్, సింహాద్రి, మేక వెంకటేష్, జలగం ప్రవీణ్, చిలువేరు వికాస్, గుడిబైన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ కుమార్ సేవలు మరువలేనివి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో ఆగస్టు,31, (జనంసాక్షి) :** జిల్లాకు రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కిషోర్ కుమార్ అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో బదిలీలు, పదవీ విరమణలు సహజమని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిషోర్ కుమార్ రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా భూ సమస్యల పరిష్కారం, ధాన్యం కొనుగోళ్లు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లను సకాలంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయడంలో ఆయన కీలకంగా పనిచేశారని అభినందించారు. వరంగల్ జిల్లాలోనూ ఇదే అంకితభావంతో పనిచేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. అలాగే, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్‌గా నరసింహమూర్తి సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కలెక్టర్ తెలిపారు. అనుభవజ్ఞులైన ఈ అధికారులు పదవీ విరమణ చేయడం జిల్లాకు లోటేనని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా భావి జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వీడ్కోలు సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రతి అధికారి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ పొందిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి మాట్లాడుతూ, తమ ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటుచేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, సింగరేణి సంస్థ అధికారులు బుద్ధ ప్రకాష్, రాధాకృష్ణ, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్య చంద్ర దాస్, కాంతయ్యదాస్, వ్యవసాయ కమిటీ చైర్మన్ భానేష్, కార్పొరేటర్లు చిలువేరు జ్యోతి, శేరు శ్రీలక్ష్మి లతో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం పద్మనాయక ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టి, విద్యార్థులకు అల్పాహారం అందించి ఏకాగ్రతతో విద్యను అభ్యసించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ 8 కోట్ల రూపాయల సి.ఎం.ఆర్. నిధులను అందించడం అభినందనీయమని తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ... కొడంగల్, మధిర, మంథని తరువాత మంచిర్యాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కిచెన్ నిర్వహణ బాధ్యతలు చేపట్టి జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 42 వేల 450 మంది విద్యార్థులకు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 6 వేల 654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు.

హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ..... సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ఈ ప్రాంతంలో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు ప్రతి ఉదయం సకాలంలో వేడిగా అల్పాహారం అందించేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్‌తో కలిసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిచెన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ స్టీమర్లతో గంటకు 5 వేల 400 ఇడ్లీలు, ఆటోమేటిక్ దోశ మెషీన్‌తో గంటకు 2 వేల దోశలు, ఆటోమేటిక్ పూరీ మెషీన్‌తో గంటకు 3 వేల పూరీలు, సాంబార్, కూరల తయారీ యూనిట్ల ద్వారా 2 గంటలలో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా ఆహారం, రైస్ కుకింగ్ పరికరాల ద్వారా కేవలం 15 నిమిషాలలో 1 వేయి మందికి సరిపడా అన్నం తయారు చేసే సామర్థ్యం ఉందని తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట, ఆగస్టు 31 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణంకు భంగం కలుగకుండా, సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ సోమవారం తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని, సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డ కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బందులకు దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవని అన్నారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

## సబ్ జైలులో ఆకస్మిక తనిఖీ

- ఖైదీలకు అందుతున్న వసతులు, ఆహార నాణ్యతపై ఆరా



**కొండమల్లేపల్లి, ఆగష్టు 31 (జనంసాక్షి) :** దేవరకొండ ఉప కారాగారాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని మౌలిక వసతులు, ఖైదీలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. జైలులోని ఖైదీలతో నేరుగా మాట్లాడిన జడ్జి కె.అనిత వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, వారి సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి. జైలులో ఉన్న ఖైదీలు తమకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కె.అనిత సూచించారు. న్యాయ సహాయం అవసరమైన వారు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఖైదీల హక్కులు, వారికి అందాల్సిన న్యాయ సహాయం, సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తనిఖీలో భాగంగా జైలులోని పలు విభాగాలను పరిశీలించి, ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఉమామహేశ్వర్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఎస్. శ్రీకాంత్, వి. రమేష్, సబ్ జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



**పెంట్లవెల్లి, ఆగస్టు 31 (జనం సాక్షి) :** నేరాల నిర్ణయంపై దృష్టి కేంద్రీకరించాలని పోలీసులకు డిఎస్పి బి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసులు, విచారణలో పురోగతి, స్టేషన్ పరిసరాలు, ఆన్లైన్ కేసుల వివరాల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎస్సై పవన్ కుమార్ సూచించారు. శాంతి భద్రతలకు ఎవరు ఆటంకం కలిగించిన ఉపేక్షించొద్దన్నారు. ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది మోహన్, మహేష్, రాజన్ గౌడ్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి పోర్టల్లో ఎప్పటికప్పుడు ఆన్లైన్ నమోదు
- ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేని యెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జడ్పీ సీఈఓ శిరీష, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యూఓ నరసింహారావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు యువకుడి హత్య కేసులో 23 మంది నిందితుల అరెస్ట్

- పరారీలో నలుగురు
- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఆవేశంలో జరిగిన తప్పుకు ఎన్నో కుటుంబాలు
- మానసిక క్షోభకు గురిచేస్తుంది
- సిఐ నాగబాబు తో పాటు ఎస్సై సిబ్బందిని అభినందించిన డిఎస్పి



**మణుగూరు, ఆగస్టు 31 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో సంచలనం సృష్టించిన సింహాద్రి శివకుమార్ (28) హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారని సబ్ డివిజనల్ అధికారి వంగ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెంతుల వివరాలను వెల్లడించారు.. పాత కక్షల నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన ఎం కె గ్యాంగ్' సభ్యులు జరిపిన ఈ దాడికి సంబంధించిన వారిని పట్టుకోవడంలో కీలక పురోగతి సాధించారు. ఈ ఘోర హత్య కేసులో మొత్తం 27 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటికే 23 మంది నిందితులను ప్రత్యేక పోలీసు బృందాలు వేర్వేరు ప్రాంతాల్లో అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన కొద్ది రోజుల్లోనే మెజారిటీ నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు.

### అసలేం జరిగింది..

27.06.2026వ తేదీన మణుగూరు నేతాజీ గ్రౌండ్ నందు జరిగిన గాంధీబొమ్మ సెంటర్ కు చెందిన సింహాద్రి శివకుమార్ శివ హత్య విషయంలో మృతుడు తండ్రి సింహాద్రి వీరభద్రాచారి తన కొడుకు సింహాద్రి శివకుమార్ శివ గత నాలుగు సంవత్సరాల నుండి ఇంటీరియల్ వర్క్ చేస్తూ హైదరాబాదు నందు ఉంటున్నాడని, మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్ కు చెందిన బొల్లి హర్ష, సుందరయ్య నగర్ కు చెందిన కర్రీ సతీష్ అనువారు తన కొడుకు దగ్గర పనిచేస్తున్నారని. అదే విధంగా గాంధీ బొమ్మ సెంటర్ కు చెందిన లోకేష్ అనే అతను కూడా చదువుల నిమిత్తం హైదరాబాదులో ఉంటూ బాగా తాగి నెల రోజుల క్రితం సతీష్ కు ఫోన్ చేసి మీ చెల్లి ఎక్కడ ఉందో నాకు తెలుసు, మీ చెల్లిని ఏం చేయాలో అదే చేస్తా అంటూ పాత గొడవలు మనసులో పెట్టుకొని ఫోన్లో అతని తిడుతూ ఉండేవాడని, అట్టి విషయంలో వాళ్ళిద్దరి మధ్య గొడవ జరగగా లోకేష్ సతీష్ ను కొట్టగా తన కొడుకు శివ అడ్డుపడి గొడవ ఆపినాడని, ఇట్టి విషయం గురించి లోకేష్ ఎం కే గ్యాంగ్ లీడర్ జెట్ ఫట్ రమాకాంత్ రమ్మీ బెట్టి కి చెప్పగా నాలుగైదు రోజుల నుండి జెట్టి సతీష్ కు ఫోన్ చేసి శివ గాడు ఎప్పుడు మణుగూరుకు వస్తాడో చెప్పు వస్తే వాడి సంగతి చూస్తామని బెదిరిస్తున్నారు. ఈ క్రమంలో 26.08. 2026 రోజున మధ్యాహ్నం తన కొడుకు, సతీష్, బన్నీలు ఇంటీరియల్ పనిలో ఉండగా రమకాంత్ ఏ రమ్మీ ఏ జెట్టి సతీష్ కు ఫోన్ చేసి రాఖీ పండక్కి వస్తున్నారా వస్తే మిమ్మల్ని చంపేస్తామని ఫోన్ లో బెదిరిస్తూ మాట్లాడుతుండగా పక్కనే ఉన్న తన కొడుకు శివ ఫోన్ తీసుకొని మేము పనిలో ఉన్నాము మధ్యలో ఎందుకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నావని అని అన్నందుకు జెట్టి తన కొడుకును నువ్వు ఎవ్వడివి రా మధ్యలో వచ్చి మాట్లాడుతున్నావు అని బూతులు తిట్టి నాడు. అదే రోజు సాయంత్రం సమయంలో శివ కు జెట్టి ఫోన్ చేసి ఎక్కడున్నావో మణుగూరుకు రా నువ్వు నేను ఎవరో ఒకరం బ్రతికి ఉండాలని బెదిరించినాడనీ, అయితే ది 27 8 2026 రోజు ఉదయం ఏడు గంటలకు తన కొడుకు శివ హైదరాబాదు నుండి మణుగూరు వచ్చి ఫ్రెష్ అయ్యి ఇంటి పక్కన ఉన్న ఉదయ్ కుమార్ ను తీసుకొని బైక్ పై ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో నేతాజీ గ్రౌండ్ కి వెళ్ళగా అప్పటికే అక్కడ ప్లాన్ ప్రకారంగా వచ్చి ఉన్నటువంటి జెట్టి, సాదిక్, వినయ్, దినేష్, జంపయ్య , ప్రసాద్ నా కుమారుని వద్ద పనిచేసి సతీష్ వాళ్ళ ఫ్యామిలీ విషయంలో తన కొడుకు అడ్డు వస్తున్నాడని అని మనసులో పెట్టుకొని తన కొడుకును చంపాలనే ఉద్దేశంతో పథకం ప్రకారం నా కొడుకుని గ్రౌండ్ కి రమ్మని చెప్పగా నా కొడుకు తన ఫ్రెండ్ ఉదయ్ కుమార్ ను తీసుకొని బైక్ పై నేతాజీ గ్రౌండ్ వెళ్ళగా వారందరూ ముకుమ్మడిగా నా కొడుకు పై దాడి చేసి నా కొడుకును కొట్టి చంపినారని ది 27.08.2026వ తేదీన పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు ఇవ్వగా అట్టి పిర్యాదు మేరకు మణుగూరు క్రైమ్ నంబర్.309/2026 యు/ఎస్ 189(2), 103(2), 109 (1), 351(3), 61(2) ఆర్/డబ్ల్యూ 190 ఆఫ్ బి ఎన్ ఎస్ గా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా శివ హత్య కేసులో మొత్తం 27 మంది నిందుతులను గుర్తించి అందులో 23 మందిని ఈరోజు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మోటార్ సైకిళ్లు – 9, చరవాణిలు– 20, కర్ర–1, చేతి కడియం–1 ను స్వాదీన పర్చుకొని వారిని రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

### మరో నలుగురి కోసం తీవ్ర గాలింపు

ప్రస్తుతం ఈ కేసులో ఇంకా నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా వర్గాలను రంగంలోకి దించారు. నిందితులు ఎవరైనా, ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని డీఎస్పీ రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో ఇటువంటి ముఠా గొడవలకు, వ్యసనాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పరారీలో ఉన్న నలుగురిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు.

## విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రాధాన్యమివ్వాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, ఆగస్టు 31 (జనంసాక్షి) :** సమాజంలో అత్యంత వెనుకబడిన విముక్తి జాతుల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన విముక్తి జాతుల దినోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చారిత్రక కారణాల వల్ల తీవ్ర అణచివేతకు గురైన ఈ వర్గాలకు సామాజిక భద్రతతో పాటు ఆర్థిక పరిపుష్టి కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బ్రిటిష్ పాలనా కాలంలో ప్రవేశపెట్టిన క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ వల్ల కొన్ని కమ్యూనిటీలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయని పేర్కొన్నారు. పుట్టుకతోనే నేరస్తులుగా ముద్ర వేసి సమాజానికి దూరం చేసిన ఆనాటి దురాచారాలు వారి అభివృద్ధికి పెద్ద ఆటంకంగా మారాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఆ చట్టం రద్దయినప్పటికీ, నేటికీ ఆ వర్గాలు అనేక రకాలుగా వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో వారికి తగిన గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, గృహ వసతి కల్పించడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందన్నారు. విముక్త జాతుల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి గ్రామీణ స్థాయి నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, డీఎల్పీఓలు, పంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యం చేసి గ్రామాల్లో లోపాలు, అవసరాలను గుర్తించాలన్నారు. ప్రస్తుతం నిర్దిష్ట గణాంకాలు లేనందున, ప్రాథమిక సర్వే ద్వారా అర్హులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ పథకాలను శాచురేషన్ పద్ధతిలో వర్తింపజేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద అర్హులైన వారికి విడతల వారీగా లబ్ధి చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించినప్పుడు కేవలం విముక్త జాతులకే పరిమితం కాకుండా, వెనుకబడిన అన్ని వర్గాల అవసరాలను గుర్తించాలని స్పష్టం చేశారు. విద్యా, వైద్య రంగాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన సేవలను అందించేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విశాల్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, యాదవ సంఘం నాయకులు కోడి లింగయ్య, పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బహుజన మహాసభ సంఘం నాయకులు వీరబోయిన వెంకట్ యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బాధ్యులు చిన్న శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయండి

- మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, ఆగష్టు 31 (జనం సాక్షి) :** పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2వ తేదీ నాటికి వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పోరుబాట నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని నామ విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు మద్దతు ధర, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. అదేవిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మందగించాయని నామ పేర్కొన్నారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పార్టీ ప్రకటించిన కార్యాచరణ ప్రకారం వివిధ స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీలు

- మూడు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు



**మర్రిగూడ, ఆగస్టు 31 (జనం సాక్షి) :** మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, ఖుదాబక్షపల్లి గ్రామాల్లో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీలు జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మూడు చోరీలు ఒకే రోజు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు మర్రిగూడ ఎస్ఐ రాంబాబు తెలిపారు. బాధితులు ఎక్కువ రోజుల పాటు దూర ప్రాంతాల్లో ఉండటంతో ఇళ్లలో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా గుర్తించి, వేర్వేరు తేదీల్లో పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు వెల్లడించారు. చోరీ జరిగిన ఇళ్లను దేవరకొండ డీఎస్పీ ఎం.వి శ్రీనివాస్ రావు స్వయంగా సందర్శించి క్రైమ్ సీన్ను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకుని, దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. నిందితులను గుర్తించి త్వరగా అరెస్టు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంతో ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని ఎస్ఐ రాంబాబు తెలిపారు. మూడు ఘటనలు ఒకే రోజు జరిగినవేనని, వేర్వేరు తేదీల్లో ఫిర్యాదులు అందడం వల్ల వరుస చోరీలుగా ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నిందితులను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని, వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి దూరంగా వెళ్లాల్సి వస్తే పోలీసులకు, ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలని, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎస్ఐ రాంబాబు భరోసా ఇచ్చారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తాను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవసరమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురేఖలు మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.






# నష్టాల్లో ముగిసిన సూచీలు..

## సెన్సెక్స్ 307 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు సూచీలపై మరోసారి ప్రభావం చూపాయి. అమెరికా- ఇరాన్ పరస్పరం దాడులకు దిగడం, క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు నష్టపోయాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,130.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,264.51) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,751.32 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 307.24 పాయింట్ల నష్టంతో 76,957.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 95.25 పాయింట్ల నష్టంతో 24,080.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.31 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,451 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



**చమురుపై స్పష్టత వస్తేనే..**

ముడి చమురు ధరలపై స్పష్టత వచ్చేంత వరకు ప్రామాణిక సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక వృద్ధిరేటు గణాంకాలు ఈనెల 31న అధికారికంగా విడుదల కానున్నాయి. తయారీ, సేవల పీఎంఐ, జీఎస్టీ గణాంకాలనూ పరిశీలించాలి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ కీలక రేట్ల పెంపు దిశగా సంకేతాలిచ్చిన నేపథ్యంలో, మన సూచీలపై ఆ ప్రభావం పడొచ్చు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకునే యోచనేదీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూచాయగా చెప్పాకే, చమురు ధరలు పెరగడం ప్రారంభించాయి. ఆగస్టులో ఇప్పటివరకు విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు రూ.30,919 కోట్ల పెట్టుబడులు పెట్టారు. నిఫ్టీ-50కి 24,050 వద్ద మద్దతు కనిపిస్తోందని, నిరోధం 24,200-24,350 వద్ద ఎదురు కావొచ్చని సాంకేతిక నిపుణులంటున్నారు. వివిధ రంగాలపై ఈవారం మార్కెట్ నిపుణుల విశ్లేషణలు ఇవీ..ఇటీవల ఉక్కు ధరలు పుంజుకున్నందున ఫెర్రస్ లోహ కంపెనీల షేర్లు రాణించొచ్చు. అల్యూమినియం ధరలు పెరిగే వరకు ఆయా కంపెనీల షేర్లు ఒత్తిడిలో పడొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి తొలుత 13,220 వద్ద, ఆ తర్వాత 12,700 వద్ద మద్దతు లభించొచ్చు. యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. ముడిపదార్థాల అధిక వ్యయం కారణంగా ఈ రంగ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి ఉంటుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. అధిక షేర్ల విలువలు లాభాలను పరిమితం చేయొచ్చు. వాహన సూచీ ఇంకా 20 రోజుల చలన సగటు కంటే దిగువనే చలిస్తుండడంతో స్థిరీకరణ దిశలో కొనసాగొచ్చు. ఆగస్టు విక్రయాల్లో టీఎమ్‌పీవీ, టాటా మోటార్స్, టీవీఎస్, ఎస్కార్ట్స్ రాణించొచ్చు. ఐటీ షేర్లపై ఫెడ్ ఛైర్ వ్యాఖ్యల ప్రభావం ఉంటుంది. ఏఐ ఆదాయాల డిఫ్లేషన్ విషయంలో దేశీయ ఐటీ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. అయితే వీటికే ప్రయోజనం చేకూరొచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. బలమైన మూలాలకు తోడు, రక్షణాత్మక కొనుగోళ్ల మద్దతున్నా, లాభాల స్వీకరణ, బలహీన మార్కెట్ పరిస్థితులు ఇందుకు కారణం. ఫార్మా సూచీకి 24,400 వద్ద నిరోధం, 23,800 వద్ద మద్దతుతో దిద్దుబాటు కొనసాగొచ్చు. టెలికాం షేర్లు మిశ్రమంగా, ఎంపిక చేసిన షేర్ల ఆధారంగా కదలాడొచ్చు. ఈ వారం బీఎస్‌ఈ టెలికాం సూచీకి 3,640 వద్ద మద్దతు, 3,790 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఈ స్థాయులకు వెలుపల 3,550 వద్ద మద్దతు, 3,880 వద్ద నిరోధం ఉండొచ్చు.అధిక వ్యయాల కారణంగా మార్జిన్లపై ఒత్తిడి పడే అవకాశం ఉన్నందున సిమెంటు కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలోనే ట్రేడవవచ్చు. సమీపకాలంలో సిమెంటుకు గిరాకీ స్థిరంగా ఉంటుందన్న అంచనాల వల్ల నష్టాలు పరిమితం కావచ్చు.ముడి చమురు అధిక ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఎఫ్‌ఎమ్‌సీజీ విక్రయాల వృద్ధి, లాభదాయకతకు కళ్లెం పడొచ్చు. బలహీన వర్షాలు కూడా ఈ ఉత్పత్తుల గిరాకీపై ప్రభావం చూపొచ్చు. ఇప్పటికే నిల్వల వ్యయాలు పెరగ్గా, ఇటీవలి ధరల పెంపుతో గిరాకీ తగ్గడంతో బేరిష్ సెంటిమెంటు కనిపిస్తోంది.చమురు ధరలు పెరుగుతుండడంతో నిఫ్టీ చమురు-గ్యాస్ సూచీ ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ముడిచమురు బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. ప్రభావం చూపే వార్తలు లేనందున నిఫ్టీ బ్యాంక్ సూచీ చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. తన పోటీదార్లతో పోలిస్తే కోటక్ మహీంద్రా బ్యాంక్ రాణించొచ్చు. నిఫ్టీ బ్యాంక్ 57,000 - 58,000 శ్రేణిలో కదలాడొచ్చు.

# ఇంటర్నెట్ లేకున్నా.. యూపీఐ చెల్లింపులు



**ముంబై(జనంసాక్షి):** ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా 'ఖఆఎ 123ఖజీఎ' సర్వీస్‌ను ఆవిష్కరించింది. దీంతో 20 కోట్ల మందికి పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ123పే ఉపయోగించు కుంటుంది. ఈ సర్వీస్‌ను విస్తరించేందుకు నోకియా, హెచ్‌ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రీ బండిల్డ్‌గా.. అంటే ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు ఫోన్‌తో పాటే వస్తుంది."స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితమైన డిజిటల్ చెల్లింపులు 'ఖఆఎ 123ఖజీఎ' సర్వీస్ ద్వారా దేశంలోని ప్రతి మూలకూ విస్తరిస్తాయి" అని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ అన్నారు. అందరికీ సమానస్థాయిలో సేవలు అందించే ఉద్దేశంతోనే దీనిని తీసుకొచ్చామన్నారు. దీనిద్వారా యూజర్లు వ్యక్తులకు, వ్యాపారులకు చెల్లింపులు చేయొచ్చని పేర్కొన్నారు. కెమెరా కలిగిన ఫీచర్ ఫోన్ వినియోగదారులు స్కాన్ చేసి చెల్లింపులు చేయొచ్చు. కేవలం చెల్లింపులే కాకుండా బ్యాలెన్స్ తనిఖీ చేయడం, లావాదేవీ హిస్టరీ కూడా తెలుసుకో వచ్చు. తొలిసారి ఈ సదుపాయాన్ని వినియోగించే వారి కోసం ఏఐ హెల్ప్ లైన్‌ను కూడా ఫోన్‌పే అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లిష్ సహా 12 భారతీయ భాషల్లో ఈ సేవల్ని వినియోగించాలో వివరిస్తుంది. భవిష్యత్‌లో బిల్లు పేమెంట్లు, రీఛార్జి వంటి సేవలనూ అందుబాటులోకి తెస్తామని ఫోన్‌పే తెలిపింది.

## క్యూ1లో భారత జీడీపీ 7.8%: కేంద్రం వెల్లడి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి 7.8 శాతం వృద్ధి నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. స్థిర ధరల వద్ద లెక్కించే వాస్తవ జీడీపీ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోని రూ.75.46 లక్షల కోట్లతో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో రూ.81.36 లక్షల కోట్లుగా అంచనా వేసినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనివల్ల 7.8 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు తెలిపింది."ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిపథంలో కొనసాగుతోంది" అని కేంద్రం తెలిపింది. ప్రస్తుత ధరల వద్ద లెక్కించే నామినల్ జీడీపీ 10.3 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.80 లక్షల కోట్లతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.88.27 లక్షల కోట్లుగా అంచనా వేసింది.

# టాటా ఈవీ బుకింగులు మూడింతలు

### టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సీసీఓ వివేక్ శ్రీవత్స

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
విద్యుత్ వాహన (ఈవీ) విభాగంలో మార్కెట్ వాటాను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) పెంచుకుంటోంది. గత 6 నెలల్లో ఈవీ బుకింగుల్లో మూడు రెట్ల పెరుగుదల నమోదైందని సంస్థ తెలిపింది. అయితే ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగా ఉండటంతో, ఆర్డర్లను వెంటనే ఇవ్వలేకపోతున్నట్లు తెలిపింది. 'గత 2-3 నెలలను గమనిస్తే మేము ప్రతి నెలా మార్కెట్ వాటా పెంచుకుంటున్నాం. గత 6 నెలల్లో మాకు, మార్కెట్‌లో రెండో స్థానంలో ఉన్న సంస్థకు మధ్య వ్యత్యాసం మరింత పెరిగింది. ఈవీల బుకింగుల్లో మేము 3 రెట్ల వృద్ధి సాధించాం. మాకు ఉన్న ఏకైక పరిమితి మా ఉత్పత్తి సామర్థ్యమే' అని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ముఖ్య వాణిజ్య అధికారి (సీఓఓ) వివేక్ శ్రీవత్స వెల్లడించారు. టీఎంపీవీలో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ భాగంగా ఉంది. 'వినియోగదార్లకు మా ఉత్పత్తులపై నమ్మకం పెరుగుతున్నందునే, ఇంతటి గిరాకీ లభిస్తోంది. వివిధ రకాల అవసరాలకు సరిపోయే ఈవీలను విస్తృత శ్రేణిలో అందిస్తున్నామ'ని శ్రీవత్స తెలిపారు. ప్రస్తుత జోరు గమనిస్తే సెప్టెంబరు-డిసెంబరు (పండల) కాలం చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితంగా ఈవీలకు ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యుత్ వాణిజ్య వాహనాల (సీవీల)కూ గిరాకీ బలంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు టాటా మోటార్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ గిరీష్ వాఘ్ తెలిపారు. చైనా నుంచి రావాల్సిన బ్యాటరీ సెల్స్ సరఫరాలో ఆటంకాల వల్ల తమ ఇంట్రా ఈవీపై ప్రభావం పడిందని.. సెప్టెంబరు చివరికి ఈ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈవీలకు సానుకూల గిరాకీ ఉన్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో కనిపించిన ఊపును కొనసాగిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 3,400కు పైగా విద్యుత్ వాణిజ్య వాహనాలకు ఆర్డర్లు లభించినట్లు వెల్లడించారు. 'పీఎం-ఇబస్ సేవా'లో కొత్త టెండర్లు రాబోతున్నాయని, వాటిపైనా ఆశాభావంతో ఉన్నామని వాఘ్ వెల్లడించారు. పూర్తిగా రిటెయిల్ విపణిలో ఉన్న చిన్న వాణిజ్య వాహనాల (ఎస్‌సీవీ) పికప్ విభాగం చాలా బాగా రాణిస్తోందని ఆయన పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ విద్యుత్ ఎస్‌సీవీల్లో 4 రెట్లకు పైగా వృద్ధి నమోదు చేసింది. సుమారు 3,200 వాహనాలు విక్రయించింది. 850కి పైగా ఈవీ బస్సుల ఆర్డర్లు ఉన్నాయి.




# సముద్ర మంథన్‌పై ఓఎన్‌జీసీ చూపు

**సొంత సామర్థ్యాల దిశగా అడుగులు • డ్రిల్‌షిప్ కొనుగోలు లేదా జేవీ యోచనలో కంపెనీ**

**దిల్లీ:** దేశీయంగా చమురు, గ్యాస్ అన్వేషణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్) అడుగులు వేస్తోంది. మిషన్ సముద్ర మంథన్‌లో భాగంగా లోతైన సముద్రంలో (డీప్ వాటర్) డ్రిల్లింగ్ సామర్థ్యాన్ని సాధించేందుకు ప్రత్యేక డ్రిల్‌షిప్‌లను నేరుగా కొనుగోలు చేయడం లేదా సంయుక్త సంస్థ (జేవీ) ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టింది. ఇందుకు అనువుగా అంతర్జాతీయ మార్కెట్‌లో సరైన డ్రిల్‌షిప్ యాజమానులను గుర్తించడం, ఆస్తుల విలువను లెక్కించడం, ఒప్పంద చర్చల్లో మద్దతు ఇవ్వడం కోసం నిపుణులైన గ్లోబల్ రిగ్- బ్రోకింగ్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు ఓఎన్‌జీసీ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) జారీ చేసింది.తొలి దశలో భాగస్వాములుగా అర్హతలున్న సంస్థలను గుర్తించి, షార్ట్‌లిస్ట్ చేయడం ద్వారా ప్రాథమిక వాణిజ్య నిబంధనలను ఖరారు చేస్తారు. ఇందుకు కాలవ్యవధి 3 నెలలు. రెండో దశ (6 నెలలు)లో యాజమాన్యం లేదా జేవీ ఒప్పంద చర్చలు, డాక్యుమెంటేషన్, ఫైనాన్సింగ్ పూర్తి చేసి రిగ్‌ను మన దేశానికి తీసుకువస్తారు. 1500 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ లోతులో పనిచేయగల డీప్‌వాటర్ ఫ్లోటర్ అనుభవం ఉన్న సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.దేశీయంగా చమురు ఉత్పత్తి పెంచి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రూ.84,084 కోట్ల వ్యయంతో నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్- సముద్ర మంథన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఇది 2030-31 వరకు అమల్లో ఉంటుంది. ఈ పథకం కింద 60 లోతైన ప్రాంతాల్లో చమురు అన్వేషణ బావులు తవ్వనున్నారు. ఒక్కో బావి నిర్మాణ వ్యయంలో 50% వరకు (గరిష్ఠంగా రూ.675 కోట్లు) ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది.ప్రస్తుతం మనదేశంలో డీప్‌వాటర్ డ్రిల్‌షిప్‌లను తయారు చేసే సదుపాయం లేకపోవడంతో, విదేశీ రిగ్‌లపై చార్టర్ విధానంలో ఆధారపడాల్సి వస్తోంది. ప్రైవేట్ లేదా థర్డ్-పార్టీ లభ్యతపై ఆధారపడకుండా శాశ్వత నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఓఎన్‌జీసీ తాజా చర్యలు చేపట్టింది. ఈ లావాదేవీల నిర్వహణ కోసం గిఫ్ట్‌సిటీలో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేయడం, ఈసీబీ వంటి విదేశీ వాణిజ్య రుణాల ద్వారా నిధులు సమీకరించే మార్గాలను పరిశీలిస్తోంది.



## ఈ వారమూ 7 ఐపీఓలు

### ఎక్స్ఛేంజీల్లో 14 కంపెనీల నమోదు

దేశీయ ప్రాథమిక మార్కెట్‌లో ఈ వారమూ ఐపీఓల సందడి కొనసాగనుంది. ప్రధాన విభాగం (మెయిన్ బోర్డు-3), ఎస్ఎంఈ విభాగాల్లో కలిపి మొత్తం 7 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు రానున్నాయి. 8 మెయిన్‌బోర్డు కంపెనీలు, 6 ఎస్ఎంఈ సంస్థల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ వారమే నమోదు కానున్నాయి.పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31-సెప్టెంబరు 2 మధ్య ఉండనుంది. పూర్తిగా తాజా షేర్ల జారీ ద్వారా కంపెనీ రూ.680 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.546-575. రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో రాబోతోంది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.125 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.227-239.దీపా జువెలర్స్ ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో వస్తోంది. తాజా షేర్ల జారీ, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా కంపెనీ రూ.459.72 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.168-177 .ఐపీఓల ద్వారా అశుతోష్ ఫైబర్ రూ.56.35 కోట్లు, శాంతి ఇనార్గానిక్స్ రూ.47.24 కోట్లు, ఫైకెమ్ టెక్నాలజీస్ రూ.14.58 కోట్లు సమీకరించనున్నాయి. ఇవన్నీ ఆగస్టు 31-సెప్టెంబరు 2 మధ్య రాబోతున్నాయి. ఫార్మ్‌పీస్ ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో ఉండనుంది. ఈ సంస్థ మార్కెట్ నుంచి రూ.32 కోట్లు సమీకరించనుంది. మెయిన్‌బోర్డు విభాగంలో అగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్, హైటెక్ ఇంజినీర్స్ లిమిటెడ్, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్, సింబయోటెక్ ఫార్మాల్యాబ్, అన్ను ప్రాజెక్ట్స్, లుమినో ఇండస్ట్రీస్, ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ప్రయారిటీ జువెల్స్ కంపెనీల షేర్లు ఈ వారం స్టాక్ మార్కెట్‌లో నమోదు కాబోతున్నాయి.

## పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే ప్రయత్నాలకు భారత్ మద్దతు

లక్ష్యంతో చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని మోదీ హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇరుదేశాల మధ్య వాణిజ్య పరిధిని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.తమ దేశంపై అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు పెజెష్కియన్ ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము యుద్ధాన్ని కోరుకోవట్లేదన్నారు. 'చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. కానీ మాపై దురాక్రమణను మాత్రం సహించబోం. బలంతో, దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తాం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలకు కూడా హానికరం. అదే సమయంలో ఆర్థిక, భద్రతా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచదేశాల మధ్య సమన్వయం అవసరం.ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. అనేక దేశాల అధినేతలు ఇందులో పాల్గొంటారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రపంచంలో తమ గుత్తాధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సమయంలో ప్రపంచ వేదికపై మన ఉనికిని, విభిన్నమైన, స్వతంత్ర స్వరాలను వినిపించడానికి ఇది దోహదపడుతోంది' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఈ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ అర్మేనియా ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్‌ను కూడా కలిశారు. రక్షణ, ఆర్థిక, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. అలాగే, మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు.

# అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య

### కొనసాగుతున్న సహాయక చర్యలు

ఖాట్మండు(జనంసాక్షి): జలప్రళయంతో జరిగిన ప్రాణనష్టం నుంచి నేపాల్ ఇంకా బయటపడలేదు. మరణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గల్లంతయినవారి కోసం ముమ్మర సహాయచర్యలు జరుగుతున్నాయి. ఆరురోజుల క్రితం వచ్చిన ఈ ఆకస్మిక వరదల కారణంగా నేపాల్ సరిహద్దులో పలు హైడ్రో ప్రాజెక్టులు కొట్టుకుపోగా.. వందలమంది ఆచూకీ గల్లంతైంది. ఆ ప్రాజెక్టుల సొరంగాల్లో 930 మందికి పైగా సిబ్బంది చిక్కుకుపోయి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. వారిని రక్షించేందుకు ఆర్మీ నిరంతరం శ్రమిస్తోంది.ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 903 మంది ప్రాణాలు కోల్పోగా.. 4200 మందికిపైగా గల్లంతయ్యారు. వారిలో దాదాపు 500 మంది విదేశీయులున్నారు. హిమానీనదం శిథిలాలు, బండరాళ్లతో చైనా-నేపాల్ సరిహద్దులో ఏర్పడిన సరస్సు కారణంగా ఇంకా వరద ముప్పు పొంచే ఉంది. దాని వల్ల భోటెకోషి నదిలో నీటి ప్రవాహం పెరుగుతూనే ఉంది. ఈ వరద ముప్పుపై చైనా ఇస్తోన్న సమాచారం ఆధారంగా దిగువ ప్రాంత ప్రజలను నేపాల్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. ఆదివారం వరద హెచ్చరికల మెసేజ్‌లతో దిగువ ప్రాంత ప్రజల ఫోన్లు దద్దరిల్లాయి. ఇప్పటికే ఆత్మీయులను కోల్పోయి, నిలువనీడలేకుండా మిగిలిన వరద ప్రభావిత ప్రాంత ప్రజలను ఈ అలర్ట్స్ మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు, త్రిశూలీ నదికి ఆదివారం దాదాపు మూడు గంటల పాటు వరద పోటెత్తడంతో 130 మీటర్ల పొడవైన ఘ్యాల్‌చౌక్-చరౌడీ సస్పెన్షన్ బ్రిడ్జి కొట్టుకుపోయింది.

# అందరి అవినీతి బయటపెడతా

ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని ఆరోపించారు. ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు.
కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు అని కవిత చెప్పారు. ఈ గడ్డ బిడ్డగా ఇక్కడ మిమ్ములను చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందేనని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా నేను తప్పు చేయలేదనే చెప్పా. నన్ను తీహార్ జైలులో ఎందుకు పెట్టారు?' అని కవిత ప్రశ్నించారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కనికరం చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధతో కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. తనను పిరికిదాన్ని అనుకోవద్దని హెచ్చరించారు. జైలులో ఉన్న సమయంలో తన అత్తగారు అండగా నిలిచారని కవిత గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం నిద్రపోతోందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే ఉచిత విద్య, వైద్యం అమలు చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమ కార్యకర్తలను బెదిరించే రోజులు పోయాయని కవిత చెప్పుకొచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు గుప్పించారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

# ఢిల్లీలో మరో నిర్భయ తరహా ఘటన..

### లిఫ్ట్ ఇచ్చి, కదులుతోన్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ(జనంసాక్షి): దిల్లీలో మరోసారి నిర్భయ తరహా ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మైన్‌పురీ జిల్లాకు చెందిన బాధిత బాలిక.. 11వ తరగతి చదువుతోంది. సరిగా చదవడం లేదని తల్లి తిట్టడంతో ఆగస్టు 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నోయిడాలో ఉన్న తన బంధువును కలిసేందుకు బయల్దేరింది. అయితే భారీ వర్షం కారణంగా గ్రేటర్ నోయిడాలోని పరి చౌక్ ప్రాంతంలో ఆగిపోవాల్సి వచ్చింది. అప్పుడే అటువైపు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తుండటంతో.. దాన్ని ఆపింది. అప్పుడు అందులో ప్రయాణికులు ఎవరూ లేరు. కానీ డ్రైవర్, కండక్టర్ ఆమెకు మాయమాటలు చెప్పి ఎక్కించుకున్నారు.ఆ తర్వాత బాలికను బెదిరించి కండక్టర్, డ్రైవర్ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి.. కశ్మీరీ గేట్ ఐఎస్‌బీటీ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద వదిలేశారు. అనంతరం ఆ బాలిక సమీపంలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం బస్సును సీజ్ చేశారు. మరమ్మతు చేయించుకొని తిరిగి వస్తుండటంతో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరని పోలీసులు వెల్లడించారు.

## కెనడాను వీడండి

గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

## 10వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి

- రాజకీయాల కతీతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**రాయికల్, ఆగస్టు 31 (జనంసాక్షి) :** నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు జగిత్యాల నియోజకవర్గానికి 10వేల ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.సోమవారం రాయికల్ పట్టణానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు తాటిపాముల మంజూష రాజశేఖర్, మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన కండ్ల పెల్లి భీమరాజు నర్సయ్య, రామజీపేట గ్రామానికి చెందిన సుర మౌనిక విజయ్, కమిరె లక్ష్మి రాజం,ఇటిక్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల కిష్టమ్మ లక్ష్మయ్య లకు చెందిన ఇందిరమ్మ గృహప్రవేశాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి కానుకలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి మొదటి విడత 3500, 2వ విడత 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు.గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పండగ వాతావరణం నెలకొందన్నారు. జగిత్యాల పట్టణానికి 4500 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేసిన కేసీఆర్ కు అదేవిదంగా మౌలిక సదుపాయాలు కల్పన కోసం 36 కోట్లు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి లకు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్న అన్నారు. రేవు దాటాక తెప్ప తగిలేసే రకం కాదు నేను అని జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ రెండు చేకూర్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఒక్కో గ్రామానికి 20 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా దాదాపు 1 కోటి రూపాయల నిధులు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ అయ్యాయన్నారు.గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఇండ్ల మంజూరు చేయలేక పోయామని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొంత స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు 5 లక్షల రూపాయలతో సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచులు వనిత రమేష్, మోహన్, అంజన్న, మల్లేశం, బోదాసు చంద్రశేఖర్,నీరటి శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,రాయికల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం రాజేందర్, నాయకులు కోల శ్రీనివాస్,తంగెళ్ల రమేష్, అచ్యుత్ రావు,గన్నె రాజారెడ్డి,మహేందర్ బాబు,మచ్చ శేఖర్, మురళి, రాజేష్, ముఖీద్, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్,సామల్ల వేణు, జలెందర్, గుజ్జుల మోహన్ రెడ్డి, భూమేష్, పడిగేల నర్సింహా,అంబాల రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ ద్వారా పనులు వేగవంతం

- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి
- అల్ఫోర్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఘనంగా ప్రారంభం




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పనులను వేగవంతం చేయవచ్చని, నిఘా సైతం పెట్టి వ్యక్తుల పనిచేసే విధానాన్ని తెలుసుకోవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి ఆద్యా క్యాంపస్ లో అల్ఫోర్స్ ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ వలన మానవాళికి ఎన్నో లాభాలు ఉంటాయని ప్రతి ఒక్కరూ దీనిని సరియైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని, విజయాలను సొంతం చేసుకోవాలని చెప్పారు. వివిధ రకాల పనులు చాలా త్వరగా పూర్తి చేయవచ్చని సమయాన్ని సైతం వృధా కాకుండా చేసుకుంటామని, తక్కువ సమయంలో పనులను పూర్తి చేస్తుందన్న ఖర్చు సైతం తక్కువగా ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలని వివిధ రకాల విషయాలకు సమాచాన్ని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా సేకరించవచ్చని, ద్వారా పనులను వేగవంతం చేయవచ్చని ప్రతి ఒక్కరికి దీని మీద అవగాహన ఉండాలని తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్నటువంటి వివిధ పరీక్షలకు సంబంధించినటువంటి విశ్లేషణ ఆర్టిఫిషియన్ ఇంటెలిజెంట్ ద్వారా తెలుసుకోవచ్చని, తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థలవారు ప్రథమంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ని ప్రవేశపెట్టినట్లు హర్షం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కీలకమైన సమాచారం ఇవ్వడంలో ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ వ్యవహరిస్తుందని తెలుపుతూ ప్రధానంగా ఐఐటి, నీట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు గొప్ప వరం లాంటిదని అభివర్ణించారు. మన భారతదేశంలో ప్రతి ఒక్కరు ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ ని చక్కగా ఉపయోగించుకొని అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సాఫ్ట్వేర్ ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌదరిగూడలో పాముల భయం



**శంషాబాద్,ఆగస్టు31(జనంసాక్షి) :** శంషాబాద్ మండలం చౌదరిగూడ గ్రామంలో పాముల సంచారం పెరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిరంగినాల ప్రాంతంలో చెట్లు, పొదలు దట్టంగా పెరగడంతో పాములు జనావాసాల్లోకి వస్తున్నాయని, ఇప్పటికే ఐదుసార్లు పాములు గ్రామంలోకి వచ్చినట్లు స్థానిక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.వెంటనే పొదలు, చెట్లను తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. మరోవైపు గ్రామంలోని మూలమలుపులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి తీగలు, చెట్లు పెరగడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులకు ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పరిసరాలను శుభ్రం చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పీఈటీ లేక విద్యార్థుల ఇబ్బందులు



**కేశంపేట, ఆగస్టు 31 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటి లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో పిఈటిని నియమించాలని కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన,ఇందిరమ్మ రాజ్యం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ రూరల్, అర్బన్ మండలంలో నూతనంగా ఎంపికైన మండల,గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ 20,650 కోట్ల రుణమాఫీ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేశామన్నారు. పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దశలో 3,500 రెండో దశలో 2,000 ఇళ్లను మంజూరు చేసి పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్,బీజేపీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని,అయితే అసత్య ప్రచారం చేసే హక్కు లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు అయన పిలుపునిచ్చారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చే పిలుపులు, ప్రసంగాలను ప్రజలకు చేరేలా ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టేం దుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగిం టచాలన్నారు. గ్రామస్థాయిలో వచ్చే సమస్యలు, ప్రతిపక్షాల ప్రచారానికి సంబంధించి వాస్తవ సమాచారంతో సమాధానం ఇవ్వాలని,అవసరమైతే మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు,తనను సంప్రదించి సరైన సమాచారాన్ని తీసుకొని ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణలో చేపడుతున్న కులగణన వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నా యన్నారు. సిఎం నాయకత్వంలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలిచేలా ముందుకు సాగుతోందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల,జిల్లా,గ్రామ కమిటీ నాయకులు పార్టీ కోసం గతంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి గ్రామ నాయకుడు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వేదికల్లో చురుకుగా ఉండాలన్నారు. అయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గల్లీగల్లీలో రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తాం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలోనూ నూతనంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నందున కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మోడల్ రోడ్లు, స్కై వాక్, జంక్షన్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, వాటర్ డ్రెయిన్స్ నిర్మాణం వంటి వాటితోతోపాటు అభివృద్ధిలో కరీంనగర్ ను తెలుగు రాష్ట్రాల్లోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దబోతున్నట్లు తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ఏడేళ్లలో రూ.22 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేసినట్లు వివరించారు. సోమవారం కరీంనగర్‌లోని 45వ డివిజన్ మంకమ్మతోట ఎమ్మెల్సీ గోపాల్ రావు బిల్డింగ్ సమీపంలో రూ.70 లక్షల యూఐడీఎఫ్ నిధుల అంచనా వ్యయంతో డ్రెయిన్ పైప్ లైన్, సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిసనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లు, పలువురు బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కసితో పనిచేస్తున్నామని అందులో భాగంగా కేంద్రం నుండి రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులు తీసుకొచ్చినమని, ఇవిగాకుండా మరో రూ.30 కోట్లు వచ్చే అవకాశముందని, దీంతోపాటు కేంద్ర పెద్దలను ఒప్పించి యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ను చేర్పించి రూ.840 కోట్లు నిధులు తీసుకొచ్చినమని, ఆయా నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలను మార్చబోతున్నామని, రూ.630 కోట్లతో కరీంనగర్ లో 40 పీట్లు అంతకంటే ఎక్కువ మోడల్ రోడ్లను 50 కి.మీల మేరకు నిర్మించబోతున్నమని, దీంతోపాటు జిల్లా కోర్టు, సివిల్ ఆసుపత్రి, గీతాభవన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తామని, కరీంనగర్ బస్ స్టేషన్ వద్ద స్కై వాక్ (హైదరాబాద్ ఉప్పల్ తరహాలో) ను నిర్మిస్తామని, నగరంలోని ట్రాఫిక్ జంక్షన్లను గుర్తించి వాటిని సుందరంగా అభివృద్ధి చేస్తామని, దీంతోపాటు 130 ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసి నగరంలో కాలుష్య రహిత రవాణా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావ్, స్థానిక కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయశ్రీ - శ్రీనివాస్, ఇతర డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, కాలనీ ప్రముఖులు,డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీడ్ గణేశుడిని పూజించడం మంచిది

- పర్యావరణ హితానికి అది ఎంతో మేలు
- సినీనటులు చిరంజీవి



**హైదరాబాద్, ఆగస్ట్31 (జనంసాక్షి) :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని సినీ నటులు చిరంజీవి పిలుపునిచ్చారు. ప్రకృతి సంరక్షణ, పచ్చదనం పెంపు కోసం ఈసారి అందరూ సీడ్ గణెళిశుడిని పూజించాలని కోరారు. మట్టి వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణెళిశుడిని పూజించిన అనంతరం ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. అందులోని విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తుందని అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపొందించిన సీడ్ గణెళిశా ప్రతిమలను చిరంజీవి ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే కోట్లాది మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహిస్తున్న సంతోష్ కుమార్‌ను అభినందించారు. ఆయన చేస్తున్న కృషికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా పండుగ ఉత్సాహంతో పాటు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్ గణెళిశుడిని ఆరాధించడం ద్వారా అటు పుణ్యం.. ఇటు పురుషార్థం.. అంటే ప్రకృతిని కాపాడే బాధ్యత దక్కుతుంది' అని చిరంజీవి అన్నారు. 'వినాయక చవితి వచ్చిందంటే ఊరూవాడా వేడుకలే. అయితే ఇటీవల పోటీ పెరిగిపోవడంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. దీంతో నీళ్లు కలుషితమవుతున్నాయి. పండుగతో అందరికీ ఆరోగ్యం అందాలి. భగవంతుడి ఆశీస్సులు లభించాలి. ఈ నేపథ్యంలో సోదర సమానుడైన సంతోష్ సీడ్ గణెళిశాను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అని చెప్పారు.

## చారిత్రాత్మక శాంతియుత ఉద్యమానికి విరామం

- ఆరోగ్య శాఖ మంత్రి హామీతో సమ్మె విరమణ




**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 31 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని ఆయుష్ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు మరియు విద్యార్థి నాయకుల ప్రతినిధి బృందం, సచివాలయంలో గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహని కలిసి తమ దీర్ఘకాలిక సమస్యను వివరించడం జరిగింది.గత 28 రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న శాంతియుత సమ్మె, నిరసనలు మరియు ఉద్యమం గురించి మంత్రి గారికి సమగ్రంగా వివరించారు. దాదాపు పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న హౌస్ సర్జన్లు మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు సమస్యను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు.విద్యార్థులు మరియు డాక్టర్ల ఆవేదనను సానుకూలంగా, సహానుభూతితో విన్న గౌరవనీయులైన ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ గారు, వారి న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరిస్తామని పూర్తి హామీ ఇచ్చారు.

ముఖ్యంగా, అలోపతితో సమానమైన స్థాయిలో ఆయుష్ స్టైపెండ్‌ను పెంచే అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుని, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి అతిత్వరలో అధికారిక జీవో విడుదల చేస్తామని మంత్రి గారు హామీ ఇచ్చారు.మంత్రి స్పష్టమైన హామీపై విద్యార్థులు, హౌస్ సర్జన్లు మరియు పీజీ డాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.గౌరవనీయులైన ఆరోగ్య శాఖ మంత్రి గారి హామీపై పూర్తి విశ్వాసం, నమ్మకం మరియు గౌరవంతో, తెలంగాణ విద్యార్థులు, హౌస్ సర్జన్లు మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు తమ 28 రోజుల నిరవధిక శాంతియుత సమ్మెను అధికారికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. అంతా ఇప్పుడు సమానమైన స్టైపెండ్‌కు సంబంధించిన అధికారిక జీవో విడుదల కోసం ఆశతో ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

"మేము మా పోరాటాన్ని విరమిస్తున్నాం, ఆరోగ్య శాఖ మంత్రి మాటపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ఇప్పుడు మా దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్‌కు సంబంధించిన అధికారిక జీవో కోసం ఎదురుచూస్తున్నాము." అని విద్యార్థి నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా 28 రోజులుగా ఉద్యమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థి, హౌస్ సర్జన్ మరియు డాక్టర్ యొక్క ఐక్యత, సహనం, క్రమశిక్షణ మరియు శాంతియుత పోరాట స్ఫూర్తికి నాయకులు అభినందనలు తెలిపారు.

## చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్ట్ 31 (జనం సాక్షి) :** నగరంలోని చంచల్ గూడ జైలులో రిమాం డ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## ప్రేమ విఫలమై కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, ఆగస్ట్31 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో దారుణం జరిగింది. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్ నిభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. లవ్‌ఫెయిల్యూర్‌నే బలవన్మరణానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమల నగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో నిభాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యా డు. ఈ క్రమంలోనే రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. అంతకుముందు ఈ విషయాన్ని వాట్సాప్‌లో తన స్నేహితులకు సమాచారం అందించాడు. అయితే ఉదయం స్నేహితులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా.. నిభాష్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్ట్ 31 (జనంసాక్షి) :** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. చదువు సరిగా రావడం లేదనే మనస్తాపంతో 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థి మల్లికార్జున్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మల్లికార్జున్ తండ్రి పెయింటింగ్ పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కన్న బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# శిథిలావస్థలో బోయగుడిసెల ప్రభుత్వ పాఠశాల

- మూడేళ్లుగా విద్యార్థులకు తప్పని అవస్థలు
- ఒకేగదిలో ఒకటి నుండి నాలుగో తరగతి వరకు 25,విద్యార్థులకు బోధన
- నూతన భవనం కోసం ఎదురుచూపులు






**మహమ్మదాబాద్,ఆగస్టు 31 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల పరిధిలోని,ఎల్కిచెరువు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బోయగుడిసెల ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత మూడేళ్లుగా పాఠశాల భవనం పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శిథిలావస్థకు చేరుకున్న పాత పాఠశాల భవనానికి ఆనుకుని నూతనంగా నిర్మించిన ఒకే ఒక్కగదిలోనే విద్యాబోధన కొనసాగుతోంది. ఈ గదిలోనే 1 నుంచి నాలుగో తరగతి వరకు సుమారు 25 మంది విద్యార్థులు చదువుతున్నారు.ఒకే గదిలో పలు తరగతుల విద్యార్థులకు బోధన అందించడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు నూతన భవనం లేకపోవడంతో విద్యార్థుల భద్రతతో పాటు వారి విద్యాభ్యాసంపై కూడా ప్రభావం పడుతోందని గ్రామ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ,మూడేళ్లుగా పాఠశాల సమస్యను ఎవరు పట్టించుకోవడం లేదు..

**నూతన పాఠశాల భవనం కొరకు ప్రజావాణిలో వినతి..**

ఏల్కిచెరువు తండా గ్రామపంచాయతీ ఆధీనంలో ఉన్న బోయ గుడిసెలోని ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని, ఎల్కిచెరువు తండా గ్రామ,సర్పంచ్ సోమ్లా నాయక్,సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన,ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో, నరేందర్‌రెడ్డి కి, (ఎంఈఓ) రాజునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంటనే నూతన ప్రభుత్వ పాఠశాల భవనం మంజూరు చేయాలని తెలిపారు.

# పల్లె రహదారులకు మహర్దశ

- రూ.3.50 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన
- ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక
- విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- విధులకు రాని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



**తలకొండపల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి):** ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామీణ రహదారులకు కాంగ్రెస్ ప్రజాపాలనలో మహర్దశ వచ్చిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం జూలపల్లిలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేసి, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. జూలపల్లి నుంచి చుక్కగుట్ట తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.10 కోట్లు, చంద్రధన నుంచి జూలపల్లి వరకు రహదారి మరమ్మతులకు రూ.2.40 కోట్లు కలిపి రూ.3.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్వకుర్తి నియోజకవర్గానికి 5,608 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. జూలపల్లిలో నిర్మించిన ఐదు ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్ల నిర్మాణం జరగలేదని విమర్శించారు.

విద్యాభివృద్ధిలో భాగంగా ఖానాపూర్ శివారులో 25 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు. వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమాలకు సంబంధిత శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసి, ప్రజా కార్యక్రమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అలజడి.. కేకలతో పరుగులు

## పీర్జాదిగూడలో నలుగురు దొంగల చోరీ యత్నం




బోడుప్పల్-జనంసాక్షి : ప్రశాంతంగా ఉండే కాలనీలో అర్ధరాత్రి దొంగల సంచారం కలకలం రేపింది. నలుగురు వ్యక్తులు కాలనీలోకి చొరబడి ఇళ్లను పరిశీలిస్తూ చోరీకి యత్నించడం స్థానికంగా ఆందోళనకు కారణమైంది. ఓ ఇంట్లోకి ప్రవేశించిన అనంతరం అక్కడ ఏమీ లభించకపోవడంతో మరో ఇంటి వైపు వెళ్లి గోడ దూకేందుకు ప్రయత్నించారు. ఇంతలో వారి కదలికలను గుర్తించిన ఓ మహిళ గట్టిగా కేకలు వేయడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. దొంగలు కాలనీలో చాలాసేపు సంచరిస్తూ ఇళ్లను రెక్కీ చేసినట్లు సీసీ కెమెరాల దృశ్యాలను బట్టి తెలుస్తోంది. నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్న దృశ్యాలు కెమెరాల్లో నమోదయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దొంగలను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కాలనీ వాసుల్లో ఆందోళన..**

అర్ధరాత్రి వేళ నలుగురు వ్యక్తులు కాలనీలో సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ పోలీసుల గస్తీని మరింత పెంచాలని, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

# హమాలీ బస్తీ ప్రజలకు అండగా ఉంటా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**కమిటీ హాల్‌పై నూతన షెడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని**



**సనత్‌నగర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** పేద ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పద్మారావునగర్‌లోని హమాలీ బస్తీ ప్రజలకు ఏ అవసరం వచ్చినా అన్ని వేళలా అండగా నిలుస్తున్నానని తెలిపారు.

సోమవారం పద్మారావునగర్ హమాలీ బస్తీలోని కమిటీ హాల్‌పై సీల్‌వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేకుల షెడ్డును సంస్థ అధినేత బండారు సుబ్బారావుతో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బండారు సుబ్బారావులను ఘనంగా సన్మానించి, తమ సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. హమాలీ బస్తీలో పేద ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని, వారికి చిన్నచిన్న శుభకార్యాలు, ఫంక్షన్లు నిర్వహించుకునే సమయంలో ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కమిటీ హాల్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఫంక్షన్లకు అవసరమైన వంట సామగ్రిని సైతం అందించామని తెలిపారు. ఆ సామగ్రిని భద్రపరిచేందుకు బండారు సుబ్బారావు సహకారంతో నూతనంగా రేకుల షెడ్డును నిర్మించినట్లు వివరించారు. బస్తీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను ఇప్పటికే పరిష్కరించినట్లు తలసాని గుర్తుచేశారు. బస్తీ ప్రజలు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బస్తీవాసులు సుభాష్, సత్యనారాయణ, శ్యామ్, కుషాల్, రవి, కౌసల్య, దుర్గ, నాయకులు ప్రేమ్, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, వెంకటరమణ, రాజేందర్, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిషేధిత పదార్థాలతో ఆహార తయారీ.. బేకరీపై కేసు

**శామీర్‌పేట్, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రభుత్వం నిషేధించిన హానికరమైన సింథటిక్ కలర్స్, మిక్స్‌డ్ ఫ్రూట్ ఫ్లేవర్స్‌ను వినియోగిస్తూ ఆహార పదార్థాలు తయారు చేస్తున్న బేకరీ యజమానిపై జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు, ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ సిబ్బంది సంయుక్తంగా కొల్తూరు గ్రామంలోని శ్రీ సాయి బేకరీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత సింథటిక్ కలర్స్, మిక్స్‌డ్ ఫ్రూట్ ఫ్లేవర్స్‌కు సంబంధించిన 18.5 లీటర్ల ద్రవ పదార్థాలు, 2.5 కిలోల చాక్లెట్ పౌడర్‌ను గుర్తించి స్వాధీ నం చేసుకున్నారు. బేకరీలో ఉన్న కనకయ్యపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న పదార్థాలను తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు అప్పగించే ప్రక్రియ చేపట్టినట్లు జీనోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య గౌడ్ తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన, ప్రభుత్వం నిషేధించిన పదార్థాలను ఆహార తయారీలో వినియోగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# మహిళ సంఘాల డబ్బులు సీఎం మీటింగ్‌కి వెళ్తున్నాయి

- వ్యాపార రంగాలలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
- మహిళలు పరిశ్రమలు పెట్టాలి.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**మహేశ్వరం,ఆగస్టు31(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి మీటింగ్‌కు మహిళా సంఘాల సభ్యులు పొదుపు చేసిన డబ్బులను తీసుకుంటున్నారని,సీఎం మీటింగ్ కు ఖర్చు చేసిన డబ్బును తిరిగి మహిళా సంఘాలకు ఇవ్వడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం మహేశ్వరం ప్రజా పరిషత్ కార్యాలయంలో మహేశ్వరం మండలం మహిళా సమైక్య 17వ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులును చేస్తానని మాయ మాటలు చెప్పారన్నారు.మహిళలకు ఇస్తానన్న హామీలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చాలన్నారు.మహిళలు చిన్న తరహా పరిశ్రమలను స్థాపించాలన్నారు.వ్యాపార రంగంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు సంఘటితం అయ్యారన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



- జోన్ కమిషనర్ రాధిక గుప్తను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- పెండింగ్ పనులు వేగవంతం చేయాలని వినతి

**ఉప్పల్, ఆగస్టు 31 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోన్ కమిషనర్ రాధిక గుప్త (ఐఏఎస్)లిలిను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కమిషనర్‌తో చర్చించారు. ఆయా పనులకు అవసరమైన నిధులను కేటాయించి, పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన కొత్త అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్ లో హిందూ స్మశాన వాటిక భూమి కబ్జా

**భూ కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మర్పల్లి తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు**



**మర్పల్లి ఆగస్టు 31 (జనంసాక్షి) :** భూ బకాసురులకు ఏ భూమైతే మాకేంటి కబ్జా చేయడమే వారి పని, కొన్ని శతాబ్దాల క్రితం వివిధ చేతివృత్తుల వారికి కేటాయించిన హిందూ స్మశాన వాటిక సమాధుల భూమిని కబ్జా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ఈ కబ్జా జరిగింది. వివరాలు లోకి వెళ్తే పట్లూర్ గ్రామ పరిధిలోని 417, 416, 415 గల సర్వే నెంబర్లు గత 100 సంవత్సరాల నుండి గ్రామంలోని 22 కులాలకు చెందిన వారి చనిపోయిన వారి అంత్యక్రియలు అదే స్మశానిక వాటికలో జరుపుతూ వస్తున్నారు. గత పూర్వికులు ఇట్టి భూమిని స్మశానిక వాటిక కోసం ఇచ్చారని, ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులు సర్వే చేయిస్తే తమకు వచ్చిందని కబ్జా చేశారు. కావున తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు తగు విచారణ జరిపి అక్రమ కబ్జాదారుల నుండి స్మశానిక వాటిక భూమిని కాపాడి వారిపై చట్టపరయమైన చర్యలు తీసుకోవాలని మర్పల్లి తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

# హైదర్‌షకోట్‌లో వాహనాల దగ్ధం కలకలం

**రాజేంద్రనగర్,ఆగస్టు31(జనంసాక్షి) :** హైదర్‌షకోట్ సాయి హర్షనగర్ కాలనీలోని ఓ భవనం పార్కింగ్‌లో మోటార్‌సైకిల్‌కు నిప్పంటించిన ఘటన కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పార్కింగ్‌లోకి ప్రవేశించి మోటార్‌సైకిల్‌కు నిప్పంటించినట్లు భవన యజమాని సయ్యద్ బాషా నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంటలు ఇతర వాహనాలకు వ్యాపించడంతో నాలుగు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోగా, మరో నాలుగు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అలాగే వాషింగ్ మెషీన్ కూడా దెబ్బతింది.ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తులో నిందితుడు చైతన్యను పోలీసులు గుర్తించారు. ఘటనకు గల ఆధారాలను పరిశీలిస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# హైదరాబాదీ శైలిలో ఓడోనిల్ కొత్త ప్రచారం

ఖైరతాబాద్, ఆగస్ట్ 31 (జనం సాక్షి) : డాబర్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఎయిర్ ఫ్రెషనర్ బ్రాండ్ ఓడోనిల్ 'బాత్రూమా మే ఓడోనిల్ నాకో, తో ఆప్కో బద్నామీ హో రహీ హోగి కహీ' పేరుతో హైదరాబాద్ కేంద్రంగా కొత్త ప్రచార చిత్రాన్ని విడు దల చేసినట్లు డాబర్ ఇండియా హోమ్ కేర్ మార్కెటింగ్ హెడ్ వైభవ్ రాఠీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాదీ హాస్యం, స్థానిక భాష, రోజువారీ సామాజిక పరిస్థి తులను మేళవిస్తూ బాత్రూమ్ తాజాదనం ప్రాముఖ్యతను ఈ ప్రచారం చాటి చెబుతోందని అన్నారు. స్థానిక హాస్యం, సంభాషణలు, సామాజిక పరిశీలనలతో హైదరాబాద్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా అను సంధానమయ్యేలా ఈ ప్రచారాన్ని రూపొందించామని తెలిపారు. ఈ ప్రచారం టెలివిజన్, డిజి టల్ ప్లాట్‌ఫామ్‌లు, ప్రాంతీయ కంటెంట్ క్రియేటర్ల భాగస్వామ్యంతో విస్తరించనుందని పేర్కొన్నారు.



# శరీరానికి యోగా, మనసుకు ఆధ్యాత్మికత అవసరం

**బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్**

**ధారూర్,ఆగస్టు 31(జనంసాక్షి) :** శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని, మనసుకు ప్రశాంతత, ఆత్మస్థైర్యం కలిగించేందుకు ఆధ్యాత్మికత అవసరమని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.ధారూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ..ఆధ్యాత్మిక చింతన మనిషిలో మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని, దైవభక్తితో పాటు సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఆలయాల్లో నిర్వహించే పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.అనంతరం భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు డాక్టర్ మెతుకు ఆనంద్‌కు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవు



**రాజేంద్రనగర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే కూల్చివేతలు తప్పవని నార్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద సమక్షంలో గిరిగిరిగడ్డ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఐదు భవనాల స్లాబులను అధికారులు గ్యాస్ కట్టర్‌తో తొలగించి కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిబంధనల మేరకు ఈ చర్యలు చేపట్టారు. భవన నిర్మాణాలకు ముందే సంబంధిత అనుమతులు పొందాలని, మంజూరైన అనుమతులు, నిబంధనలను ఉల్లంఘించకుండా నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో టీపీఓ రమేష్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తులకు మరో 15 రోజుల గడువు పెంపు

- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియ, దివ్యాంగుల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వ నిర్ణయం



**హైదరాబాద్, ఆగస్టు 31:** చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖా స్తు చేసుకునే గడువును ప్రభుత్వం మరో 15 రోజుల పాటు పొడిగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరిముఖ్యంగా హైదరాబాదులో కొనసాగుతున్న సర్ ప్రత్యేక ప్రక్రియ కారణంగా పలువురు అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దివ్యాంగులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించిన మంత్రి సీతక్క, అర్హులైన ఒక్కరూ కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజుల పాటు పెంచుతూ serp ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేద కుటుంబాల వారు సెప్టెంబర్ 15 వరకు తమ దరఖాస్తులను సమర్పించుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సామాజిక భద్రతా పెన్షన్లు పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని అన్నారు. అర్హత ఉన్న ఒక్క పేదవాడు, దివ్యాంగుడు సమాచారం లేకనో, ఇతర కారణాల వల్లనో ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరం కాకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దివ్యాంగులు తమ సమస్యలను, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, వారి అభ్యర్థనను మానవీయ కోణంలో పరిశీలించి గడువు పెంచామని తెలిపారు. ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. చేయూత పెన్షన్ల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని మంత్రి తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించి వారికి సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు పెంపును దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బంది దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ముఖ్యంగా దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. సెప్టెంబర్ 15ను తుది అవకాశంగా భావించి, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు

- పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు
- రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్




**మహేశ్వరం,ఆగస్టు31(జనం సాక్షి):** రాష్ట్రంలో రోజురోజుకు మహిళలకు భద్రత లేకుండా పోయిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ విమర్శించారు.రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతిపై, అత్యాచారం, హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఘోరమైన ఘటన అన్నారు. మెకానిక్ షాపులో పనిచేసే సనావుల్లా ఖాన్ అనే వ్యక్తి దుర్మార్గంగా హాస్టల్ గదిలోకి చొరబడి అత్యాచారానికి ఒడిగట్టాడని,యువతి ప్రతిఘటించడంతో అత్యంత కిరాతకంగా హత్య చేశాడని పేర్కొన్నారు.పోలీసులు కేసు నమోదు చేయకుండా అరెస్టు అధికారికంగా ధ్రువీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.మృతురాలి కుటుంబ సభ్యులను భయంభ్రాంతులకు గురి చేశారన్నారు. నష్టపరిహారం పేరుతో నచ్చజెప్పి పోస్టుమార్టం హడావిడిగా ముగించి, మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ప్రయత్నం చేశారన్నారు.పోలీసులు కేసును తొక్కిపెట్టే కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధితురాలు కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్ 6న వేదమ్మ సంస్మరణ సభ

**కమ్యూనిస్టు ఉద్యమ కుటుంబ మాతృమూర్తికి నివాళి**




**హైదరాబాద్, (జనంసాక్షి) :**
కమ్యూనిస్టు ఉద్యమంతో అనుబంధం కలిగిన కుటుంబానికి చెందిన మాతృమూర్తి బి. వేదమ్మ స్మరణ సభను సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. గద్వాల ప్రాంతానికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎల్ఐసి రామిరెడ్డి సతీమణి అయిన వేదమ్మ ఆగస్టు 4న హైదరాబాద్‌లోని తన రెండో కుమార్తె జ్యోతి నివాసంలో కన్నుమూశారు.
వేదమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె సుగుణ మావోయిస్టు ఉద్యమంలో అమరత్వం పొందారు. రెండో కుమార్తె జ్యోతి మహిళా ఉద్యమంలో కొనసాగుతూ చైతన్య మహిళా సమాఖ్యలో రాష్ట్రస్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహిళా సమస్యలపై పలు వ్యాసాలు రాస్తూ, 'మహిళామార్గం' పత్రిక కార్యకలాపాల్లోనూ కీలకంగా ఉన్నారు. కుమారుడు కొండారెడ్డి హైదరాబాద్‌లో న్యాయవాదిగా పనిచేస్తూ న్యాయ, పౌరహక్కుల ఉద్యమాలతో అనుబంధం కలిగి ఉన్నారు. చిన్న కుమార్తె విజయ కూడా మహిళా, ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వేదమ్మ కుటుంబ సభ్యుల్లో పలువురు ప్రజా, పౌరహక్కుల ఉద్యమాలతో అనుబంధం కలిగిన వారే. ఆమె అల్లుళ్లలో ఐజ సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ ఉద్యమంలో సహచరుడిని రక్షించే క్రమంలో ప్రమాదవశాత్తూ మరణించగా, చిన్న తాండ్ర పాడు పురుషోత్తం పౌరహక్కుల ఉద్యమంలో హత్యకు గురయ్యారు. మరో అల్లుడు మహంతి వెంకట్రావు ప్రముఖ పాత్రికేయుడు, గతంలో పౌరహక్కుల ఉద్యమ నాయకుడిగా పనిచేశారు.

**నేత్రదానం.. వైద్య విద్యకు పార్థివదేహం**
వేదమ్మ మరణానంతరం కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆమె మరణాన్ని కూడా సామాజిక ప్రయోజనానికి ఉపయోగపడేలా కుటుంబ సభ్యులు అవయవ దానం, పార్థివదేహదానం చేయడం విశేషం.

**సెప్టెంబర్ 6న సంస్మరణ సభ**
వేదమ్మ స్మరణ సభను సెప్టెంబర్ 6, ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని కళానిలయం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లిలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'అమ్మ ఆజ్ఞాయ స్మృతిలో...' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం భోజన కార్యక్రమం ఉంటుంది. వేదమ్మ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంస్మరణ సభకు హాజరై ఆమెకు నివాళులర్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## పోలీసు కుటుంబాల కన్నీరు తుడిచిన శాఖ

- మృతిచెందిన పోలీసు కుటుంబాలకు రూ.3 కోట్ల బీమా
- ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున అందజేసిన డిజిపి సివి ఆనంద్



**హైదరాబాద్, ఆగస్టు 31 (జనం సాక్షి);**
విధి నిర్వహణలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు తెలంగాణ డిజిపి సి.వి. ఆనంద్ అండగా నిలిచారు. ముగ్గురు పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.3 కోట్ల ను సోమవారం డిజిపి కార్యాలయంలో మృతుల కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను డిజిపి అందించారు. శంకర్‌పల్లి పరిధిలో 2025 ఫిబ్రవరి 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో 2018 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెలిమడ తండా తెల్లపుర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తంగి శ్రీనివాస్ మృతి చెందారు. ఆయన తండ్రి ముత్తంగి యాదయ్యకు డిజిపి సి. వి. ఆనంద్ రూ.1 కోటి బీమా చెక్కును అందజేశారు.

**ఇద్దరు సిబ్బంది కూడా..**
నల్లగొండ జిల్లా కనగల్ లో పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న 2004 బ్యాచ్ పోలీసు హెడ్ కానిస్టేబుల్ బోలెపల్లి సైదులు 2025 జూన్ 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వరంగల్ కు చెందిన మరో పోలీసు కానిస్టేబుల్ కె.వెంకటరెడ్డి 2026 మార్చి 10న లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందారు. వెంకట్ రెడ్డి వరంగల్ లోని ఏఆర్పిసిగా హెడ్ క్వార్టర్స్ లో విధిని నిర్వహిస్తుండగా వెనుక నుంచి లారీ తాకడంతో వెంకట్ రెడ్డి మృతి చెందారు. ఈ మృతులందరికీ ఎస్బిఐలో ఇన్సూరెన్స్ అకౌంట్ ఉండటం వలన బ్యాంక్ అధికారులతో సంప్రదించి డిజిపి వీరి కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున బీమా పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు డిజిపి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబాల సంక్షేమానికి శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిజిపి తో పాటు ఎస్‌బీఐ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

**తలకొండపల్లి:** ఆమనగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి,మాడ్గుల మండలాల్లో ఖాళీగా ఉన్న 31 అంగన్వాడీ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమనగల్ సిడిపిఓ శాంతి రేఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మండలాల వారిగా కడ్తాల్ (15), ఆమనగల్(6), తలకొండపల్లి (3 )పోస్టులు, మాడ్గులలో 3 పోస్టులు మంజూరైనట్లు ఆమె తెలిపారు.




## రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం

- 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్ ఆగస్టు 31(జనంసాక్షి):** దేశీయంగా నూనె గింజల ఉత్పత్తి పెంపు,దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం,రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా ఆమనగల్ డివిజన్ పరిధిలోని ఆమనగల్,కడ్తాల్,మాడ్గుల,తలకొండపల్లి,మండలాలకు చెందిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం"నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్"పథకం ద్వారా ప్రస్తుత సీజన్ లో రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని,అందుకు అనుగుణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.వేరుశనగ పంట సాగు అవసరమైన విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు సూచించారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ఏకకాలంలో 2 లక్షలు రైతు రుణమాఫీ,రైతు భరోసా,ఉచిత కరెంటు,సన్నాలకు బోనస్,సబ్సిడీతో వ్యవసాయ యాంత్రిక పనిముట్లు,ఉచితంగా వేరుశనగ విత్తనాలు వంటి అనేకమైన సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్,వైస్ చైర్మన్ తల్లోజు గీత,రంగారెడ్డి జిల్లా ఏడిఏ పద్మజా,ఆమనగల్ ఏడిఏ శోభారాణి,పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి రఘురాములు,మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రేణుక చక్రవర్తిని,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,దేవిడ్,మెకానిక్ బాబా,జుట్టు తిరుపతి,రాజేందర్ నాయక్,పవన్ వాల్మీకి,సురేష్,వివిధ గ్రామాలకు చెందిన రైతులు,ప్రజలు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల పేరిట ఇద్దరి అరెస్టు

**క్షుద్ర పూజల పేరుతో రూ.62 లక్షల మోసం**

- 30 లక్షల 50 వేల రూపాయలు స్వాధీనం
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి);** క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడుల పేరుతో ఓ మహిళను మోసం చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.వారి వద్ద నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు,పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన తురుపాటి శ్యాం కుమార్, వేములవాడ అర్బన్ మండలం అగ్రహారానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం కలిసి అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను క్షుద్ర పూజలతో నయం చేస్తామని నమ్మించారు. వివిధ ప్రాంతాల్లో పూజలు చేయాలంటూ ఆమె నుంచి నగదు,బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ.62 లక్షలు వసూలు చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో చేతబడులతో తనను, కుటుంబాన్ని చంపుతామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు.బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరినీ అగ్రహారంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా బెల్లంతో తయారు చేసిన రెండు బొమ్మలు,పసుపు, కుంకుమ తదితర పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, మంత్రాలు పరిష్కారం కాదని,ప్రజలు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు. మూఢనమ్మకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

- ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు విద్యార్థుల ఆరోపణ
- 170 మంది విద్యార్థులు సంతకాలతో మంత్రికి వినతి
- మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

## హాస్టల్లో ఫుడ్‌లో పురుగుల కలకలం



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 31 (జనం సాక్షి) :**
సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరా చౌరస్తాలో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్లో ఫుడ్ పురుగుల కలకలం రేపింది. సోమవారం కళాశాల హాస్టల్లో విద్యార్థులు ఒక్కసారిగా కళాశాల ముందు ఆందోళనకు దిగారు. గత కొంతకాలంగా అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ కు తెలిపినప్పటికీ స్పందించకపోగా తమపై బెదిరింపు చర్యలకు పాల్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న ఇబ్బందులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు 170 మంది విద్యార్థులు సంతకాలతో



కూడిన వినతి పత్రాన్ని పంపడం జరిగిందనీ విద్యార్థులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ప్రిన్సిపాల్ విద్యార్థులను భయభ్రాంతు లకు గురి చేస్తుందని కళాశాలలో జరుగుతున్న విషయాలను ఎవరికి చెప్పకూడదని ప్రిన్సిపాల్ ఆదేశించినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



ప్రిన్సిపాల్ డాక్టర్ పుణ్య శైలజ

**మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్**
బుదేరాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా నిర్లక్ష్యం, విద్యార్థినుల పట్ల సక్రమంగా వ్యవహరించకపోవడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు కళాశాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించారు. నివేదికను పరిశీలించిన అనంతరం కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

### కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి వైద్యాధికారి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా కోఆర్డినేటర్ కల్పన బుదేరా కళాశాలను సందర్శించి కళాశాల నిర్వహణ, పరిపాలనా అంశాలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ప్రిన్సిపల్ గా శైలజ మూడు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే విద్యార్థులకు ప్రిన్సిపల్ పై ఇంత వ్యతిరేకత రావడం గమనార్హం. నిత్యం పెట్టే భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు రోడ్డుపై ధర్నా చేసేందుకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న జిల్లా అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వారి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు భరోసా ఇచ్చి.. కలిసి భోజనం చేసి వెళ్లిపోయారు.



### దేశానికి దిక్సూచిగా తెలంగాణ అభివృద్ధి నమూనా

- ప్రజాపాలనలో 1000 రోజులు.. తెలంగాణ ప్రగతికి కొత్త దిశ
- మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, (జనం సాక్షి);** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 1000 రోజుల్లో రైతు సంక్షేమం, పేదల భరోసా, యువతకు ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా పెంపు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. 1000 రోజులు ఒక మైలురాయి మాత్రమేనని.. ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370